కమలం కథేంటి!

బీజేపీ అడుగులు ఎటువైపు.. ఒంటరిగానా .. పొత్తు దిశగానా.. ఇదే ప్రశ్న చాన్నాళ్ల నుంచి అందరి నోటా నానుతోంది. ఒకవైపు ఎన్నికల నోటిఫికేషన్ జారీకి కొద్దిరోజులే సమయం ఉండగా కమలం కసరత్తు పెంచింది. అభ్యర్థుల జాబితా రూప కల్పనకు పార్టీ ముఖ్యులతో సమావేశాలు, సుదీర్ఘ మంతనాలు. ఇంకోవైపు సంఘటన్ విభాగ్ బాధ్యుల నుంచి అంతర్గత అభిప్రాయ సేకరణ కొనసాగిస్తోంది.

- ఏలూరు - ఆంధ్రజ్యోతి ప్రతినిధి

ఆశావహుల జాబితా తుది పరిశీలన

- అన్ని అర్హతలున్నా ముగ్గురి పేర్లతోనే జాబితా
- వరుసగా పరివార్ సమావేశాలు
- పొత్తుపైనే నేతల నుంచి అభిప్రాయ సేకరణ
- నేడు ఏలూరు, నరసాపురం లోక్‌సభా స్థానాలపై భేటీ

కమలంలో ఏం జరుగుతోంది ?

ఎన్నికల సందడి ఆరంభమైన దగ్గర నుంచి ఈసారి భారతీయ జనతా పార్టీ ఏం చేయనుందా.. అని అందరిలోనూ ఉత్కంఠ. గత ఎన్నికల మాదిరిగానే ఒంటరిగానా, లేక ఇతర పార్టీలతో పొత్తులకు దిగి మారిన తాజా రాజకీయ పరిణామాలకు అనుగుణంగా అడుగుల వేయబోతోందా ? అనే సందిగ్ధత అందరిలోనూ ఉంది. గతం కంటే తాము బలపడ్డామని, మోదీ ఇమేజ్ ఒకవైపు, రామమందిర నిర్మాణం ఇంకోవైపు పార్టీ పటిష్టతను రెండితలు చేసినట్టు కమలనాథులు అంచనా వేస్తూ వచ్చారు. ఈలోపే భారతీయ జనతా పార్టీ రాజకీయ మిత్రుడు పవన్ కల్యాణ్ ఓ అడుగు ముందుకువేసి తెలుగుదేశంతో ఎన్నికల వీలుగా జత కట్టారు. ఈ పరిణామాలు ఓవైపు సాగుతుండగా భారతీయ జనతా పార్టీ అందరిని టెన్షన్‌లో పెట్టి తన పని తాను చేసుకుపోతోంది. తాజాగా విజయవాడలో రెండురోజుల నుంచి వివిధ జిల్లాల ముఖ్యులతో ముఖాముఖిలు నిర్వహిస్తున్నారు. అసెంబ్లీ, లోక్‌సభ స్థానాల నుంచి పోటీ చేసేందుకు కొందరు ఆశావహులు ఇప్పటికే పార్టీకి దరఖాస్తు చేసుకున్నారు. వాస్తవానికి ఒక్కో అసెంబ్లీ నియోజక వర్గం నుంచి మూడు నుంచి ఏడు వరకు. దరఖాస్తులు అందగా వాటిని పరిశీలిస్తున్నారు. అసెంబ్లీ నియోజకవర్గాలకు ఎంతమంది దరఖాస్తు చేసుకున్న వాటిలో ముగ్గురి పేర్లు మాత్రమే సూచించాల్సిందిగా పార్టీ ఆదేశించింది. బీజేపీ, జాతీయ సహ సంఘటన్ కార్యదర్శి శివప్రకాశ్ నేతృత్వంలో అభ్యర్థుల స్క్రీనింగ్ కొనసాగుతోంది. ఈ స్క్రీనింగ్ జరిగేటప్పుడు ప్రతీ జిల్లా నుంచి అధ్యక్షుడు, రాష్ట్ర ఆఫీస్ బేరర్‌లు, జిల్లా ఇన్‌చార్జిని భేటీలో ఉండేలా జాగ్రత్త పడుతున్నారు. నేడు ఏలూరు, నరసాపురం లోక్‌సభా స్థానాల పరిధిలో ఆశావహుల పరిశీలన ముగ్గురితో జాబితా రూపొందించేలా కార్యచరణ సిద్ధం చేశారు. ఈ రెండు నియోజకవర్గాల పరిధిలో అసెంబ్లీ స్థానాలకు దాదాపు వంద మందిపైగా దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో పార్టీ సూచించిన అర్హతలున్న ముగ్గురిని ఎంపిక చేసి జాబితాలో చేరుస్తారు. తుది నిర్ణయం పార్టీ అధినాయకత్వం నిర్ణయిస్తుంది. నేడు జరుగుతున్న కీలకభేటీకి తపన చౌదరి, భూపతిరాజు శ్రీనివాసవర్మ, విక్రమ్ కిషోర్, తాతాజీ, పాకా సత్యనారాయణ వంటి వారు హాజరవ్వనున్నారు.

మరోవైపు ఇంకో కసరత్తు

ఒకవైపు ఆశావాహుల జాబితాను పరిశీలించి తుది జాబితా రూపకల్పనకు ప్రయత్నిస్తూ ఒకవైపు సంఘటన్ విభాగాలన్ని రాష్ట్ర వ్యాప్తంగా పొత్తుకు దిగాలా వద్దా అనే అంశంపై క్షేత్రస్థాయిలో ఆరాకు దిగాయి. రాష్ట్రవ్యాప్తంగా తొమ్మిది సంఘటన్ విభాగ్‌లు ఉండగా వీటి పరిధిలో ఉన్న ఆర్‌ఎస్‌ఎస్, వీహెచ్‌పీ, ఏబీవీపీ, మిగతా అనుబంధ కమిటీల్లోని ముఖ్యులను సమావేశపరిచి అభిప్రాయ సేకరణ జరుపుతున్నారు. ఇప్పటికే కొన్నింటిలో పొత్తుకు వ్యతిరేకంగా ఒంటరిగానే బరిలో దిగేలా అభిప్రాయాలు వ్యక్తమవుతున్నట్టు సమాచారం. ఈ తరహా అభిప్రాయాలను మరోవైపు పోటీ చేయదలచిన అభ్యర్థి వివరాలను బీజేపీ అధినాయ కత్వానికి నివేదిస్తారు. జాతీయ పార్టీ అయిఉండి పోటీ చేసే ఉత్సాహం ఉన్న అభ్యర్థుల విషయంలో, మరోవైపు పొత్తు విషయంలో ఎటూ తేల్చుకోలేక ఇప్పటికే మిగతా పక్షాల కంటే వెనకబడింది.

వైసీపీ నేతల చేతుల్లో పింఛన్ల సొమ్ము
వలంటీర్లను తప్పించి పంపిణీ
7

మంచుటెండలు
తారెత్తిస్తున్న ఎండలు.. రాత్రి చలి, పొగమంచు



ఆ దొంగల పార్టీలోకే వెళ్లారు

- సూర్యప్రకాశ్‌పై గోవిందరావు ఫైర్

భీమవరం, మార్చి 2 : 'వైసీపీ దొంగల పార్టీ. అక్కడ కన్నాలు వేసే వాళ్లే ఉంటారని కామెంట్ చేసిన చేగొండి సూర్యప్రకాశ్ ఇప్పుడు ఆ పార్టీలోకే వెళ్లాడు. అలాంటి వ్యక్తిని ఏమనాలో అతడి విజ్ఞతకే వదిలేస్తున్నాం' అని జనసేన ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు అన్నారు. పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ జోగయ్య కుమారుడనే గుర్తింపు తప్ప వ్యక్తిగతంగా సూర్యప్రకాశ్‌కి ఏదీ లేదన్నారు. ఆచంట ఇన్‌చార్జిగా, తర్వాత పీఏసీ సభ్యుడి హోదా కల్పించింది పార్టీయే అనే విషయం మర్చిపోకూడదన్నారు. పవన్‌ను, పార్టీని విమర్శించే స్థాయి లేదని, వైసీపీలోకి వెళ్లాలంటే ముందుగా జనసేనను దూషించాలనే నిబంధన వల్లే అక్కడ ఇచ్చిన స్క్రిప్ట్ చదివాడన్నారు. అలాంటి వ్యక్తి పార్టీ నుంచి వెళ్లిపోవడంతో జనసైనికులంతా సంతోషంగా ఉన్నారన్నారు.

ప్రాణం ఉన్నంత వరకూ పవన్ వెంటే ఉంటా : జోగయ్య

పాలకొల్లు, మార్చి 2 : 'నేను బతికున్నంత కాలం జనసేనాని పవన్ కల్యాణ్ వెంటే ఉంటాను. ఆయన రాష్ట్రాధికారంలో భాగస్వామ్యం అయ్యేంత వరకూ పోరాటం ఆగదు' అని కాపు సంక్షేమ సేన అధ్యక్షుడు, మాజీ ఎంపీ చేగొండి హరిరామజోగయ్య శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 'ఎవరు ఏ విధంగా ప్రవర్తించినా నా పని నేను చేసుకొని వెళతాను. నాకు కావాల్సింది పవన్ రాజకీయ ఎదుగుదల. రాజ్యాధికారం దక్కించుకోవాలనే కాపులు, బడుగు బలహీన వర్గాల ఆశలకు నీరు పోసి పెంచడమేన'ని పేర్కొన్నారు. మరోవైపు పవన్ ఎక్కడ నుంచి పోటీ చేస్తే మెరుగ్గా ఉంటుందనే అంశంపై జోగయ్య శనివారం విడుదల చేసిన మరో లేఖలో విశ్లేషించారు. పవన్ పోటీ చేస్తానంటున్న పిఠాపురం, భీమవరం నియోజకవర్గాల్లో లాభనష్టాలను, గత ఎన్నికల నాటి పరిస్థితులు, నేటి పరిస్థితులను వివరించారు. టీడీపీ-జనసేన ఉమ్మడి పోరాటంలో భీమవరం నుంచి గెలుపు అవకాశాలు మెరుగ్గా ఉంటాయని వివరించారు. పిఠాపురంలో కాపు సామాజిక వర్గీయులు అధికంగా ఉన్నప్పటికీ, వైసీపీ అభ్యర్థి కాపు సామాజిక వర్గమేనని గుర్తించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మరోవైపు ముద్రగడ పావులు కదిపే విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉంటుందని లేఖలో పేర్కొన్నారు.

ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తా : ముద్దరబోయిన

ముసునూరు, మార్చి 2 : 'నూజివీడు నుంచి వెళ్లిపోతానని కొందరు ప్రచారం చేస్తున్నారు. నా ప్రాణం పోయే వరకు ఇక్కడే ఉంటా. వచ్చే ఎన్నికల్లో ఇండిపెండెంట్ అభ్యర్థిగా బరిలో దిగుతా' అని మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయిన వెంకటేశ్వరరావు స్పష్టం చేశారు. శనివారం ముసునూరు గ్రామ ప్రజల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. 'పదేళ్లుగా నూజివీడులోనే ఉంటూ, అధికారం ప్రజలకు సేవ చేయడంతోపాటు పార్టీ కార్యక్రమాలను తూచా తప్పకుండా చేశాను. ఎన్నికల్లో గెలుపు ఖాయమనుకున్న సమయంలో ఒకే సామాజిక వర్గానికి చెందిన వ్యక్తికి ఇక్కడి టిక్కెట్ ఇవ్వడం ఆవేదనకు గురిచేసింది' అని పేర్కొన్నారు.

'అధికారుల ఆదేశాలతోనే మెస్ చార్జీ వసూలు'

ఏలూరు క్రైం, మార్చి 2 : ట్రైనింగ్ సెంటర్ రూల్స్ ప్రకారం తాము మెస్ చార్జీలను వసూలు చేస్తున్నామని పెదవేగి డీటీసీ డీఎస్పీ ఒక ప్రకటనలో తెలిపారు. 'ఆంధ్రజ్యోతి'లో 'సొమ్ములు ఇచ్చి శిక్షణ పొందండి' శీర్షికన శనివారం వచ్చిన కథనంపై స్పందిస్తూ ఒక ప్రకటన విడుదల చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పెదవేగి డీటీసీలో ఇన్‌సర్వీస్ ట్రైనింగ్ నిర్వహిస్తున్నామని ట్రైనింగ్ ఐజీపీ ఆదేశాల మేరకు ఎన్నికల ప్రక్రియ కోసం కానిస్టేబుల్ నుంచి సీఐ స్థాయి వరకు శిక్షణ నిర్వహిస్తున్నామన్నారు. శిక్షణలో పాల్గొన్న సిబ్బంది నుంచి మెస్ చార్జీలు నిమిత్తం రూ.200, కామన్ గుడ్‌ఫండ్ కింద రూ.40 వసూలు చేస్తున్నామన్నారు. శిక్షణలో భాగంగా ఉదయం ఉడికించిన గుడ్లు, రాగిజావ, టీ అందిస్తున్నారని, ఉదయం బ్రేక్ సమయంలో స్నాక్స్, టీ, మధ్యాహ్నం భోజనంగా మాంసాహారులకైతే చికెన్ కర్రీ, స్వీటు, సాంబారు, చట్నీ, పెరుగు, అరటి పండు, శాకాహారులకైతే కాజూ పన్నీర్ లేదా కాజూ మష్రూమ్ కర్రీ, సాంబారు, స్వీటు, పెరుగు, అరటిపండు, మధ్యాహ్నం విరామ సమయంలో సమోసా, బిస్కెట్, టీ ఇస్తున్నట్టు తెలిపారు. వ్యక్తిగతంగా క్యారేజీలు తెచ్చుకునే నిబంధన లేదన్నారు.

నేడు పల్స్‌పోలియో

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 2 : ఐదేళ్ల లోపు చిన్నారులకు ఆదివారం నిర్వహించనున్న పల్స్ పోలియో వ్యాక్సినేషన్ విజయవంతానికి నగరంలో జిల్లా వైద్యఆరోగ్యశాఖ చేపట్టిన ర్యాలీని శనివారం డీఎంహెచ్‌వో డాక్టర్ శర్మిష్ట ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ జిల్లాలో ఐదేళ్ల లోపు పిల్లలు 1,91,466 మంది ఉండగా, వీరందరికీ వ్యాక్సిన్ వేసేందుకు 1,755 బూత్‌లను ఏర్పాటు చేశామని మొత్తం 7,020 మంది సిబ్బంది సేవలను వినియోగించుకుంటున్నట్టు తెలిపారు. జిల్లా ఇమ్యు నైజేషన్ అధికారి డాక్టర్ నాగేశ్వరరావు, మెడికల్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌ల ఆందోళన ఉద్రిక్తం

- కలెక్టరేట్ వద్ద అడ్డుకున్న పోలీసులు
- మెయిన్‌గేటు వద్ద నిరసన

ఏలూరు కలెక్టరేట్, మార్చి 2 : కేంద్ర ఆర్థిక సంఘం నిధులను పంచాయతీల ఖాతాలో జమ చేయాలని డిమాండ్ చేస్తూ ఉమ్మడి పశ్చిమ గోదావరి సర్పంచ్‌లు కలెక్టరేట్ వద్ద చేపట్టిన ఆందోళన ఉద్రిక్తతకు దారితీసింది. ఆందోళనలో పాల్గొన్న సర్పంచ్‌ల పట్ల పోలీసులు దురుసుగా ప్రవర్తించారు. స్థానిక సంస్థల నిధులు కాజేసిన సీఎం జగన్మోహన్‌రెడ్డి ఆ నిధులను పంచాయతీ ఖాతాల్లోకి జమ చేయాలని కోరుతూ ఆందోళనలో భాగంగా ఏపీ పంచాయతీరాజ్ ఛాంబర్, సర్పంచ్‌ల సంఘం ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్ వద్ద ఆందోళన నిర్వహించారు. కలెక్టరేట్‌లోకి చొచ్చుకెళ్లేందుకు బారికేడ్‌లు తొలగించారు. అక్కడే ఉన్న పోలీసులు వారిని అడ్డుకునే ప్రయత్నం చేయడంతో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. బారి కేడ్‌లు తోసుకుని కలెక్టరేట్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు మెయిన్‌గేటును మూసివేయడంతో అక్కడే నిరసన తెలిపారు. ప్రజాప్రతినిధులను కలెక్టరేట్‌లోకి వెళ్లకుండా నిలువరించడం సరికాదని మండి పడ్డారు. పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర అధ్యక్షుడు వై.వి.వి రాజేంద్రప్రసాద్ రాష్ట్రం లో స్థానిక సంస్థల నిధులు, విధులు, అధి కారాలను జగన్మోహన్‌రెడ్డి దొంగిలించారని మండిపడ్డారు. గ్రామాలు బాగు పడాలన్నా గ్రామీణాభివృద్ధి జరగాలన్నా రాష్ట్రంలోని రూ.3కోట్ల5లక్షల గ్రామీణ ప్రజల స్థితిగతులు మెరుగుపడాలంటే ఎన్నికల్లో సీఎం జగన్మోహన్ రెడ్డిని ఓడించాల్సిందేనని, జగన్ ఓడితేనే సర్పంచ్ లకు మనుగడ అని పేర్కొన్నారు. పంచాయతీ ఛాంబర్ ఉభయ గోదావరి అధ్యక్షుడు కడలి గోపాల రావు, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు పాలడుగుల లక్ష్మణరావు మాట్లాడుతూ పంచాయతీల ఖాతాల్లో ఆర్థిక సంఘం నిధులు జమ చేయాలని కోరితే పోలీసులతో గొంతు నొక్కుతారా అంటూ ప్రశ్నించారు. 14,15 ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అంద జేశారు. ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీర్రు ప్రతాప్‌రెడ్డి, వై.వినోద్‌రాజు, చుక్కా ధనుంజయ్ యాదవ్, సర్పంచ్‌ల సంఘం గౌరవ సలహాదారు పిల్లి సత్యరాజు, లంకపల్లి మాణిక్యాలరావు, కడియాల విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



సర్పంచ్‌లను అడ్డుకుంటున్న పోలీసులు



కలెక్టరేట్ గేటు వద్ద నిరసన తెలుపుతున్న సర్పంచ్‌లు



మట్టి తవ్వకాలను అడ్డుకున్న టీడీపీ నాయకులు

పోలవరం కుడికాల్వ గట్టు అక్రమ తవ్వకాలు

పెదవేగి, మార్చి 2 : పోలవరం కుడి కాల్వ మట్టి అక్రమ తవ్వకాలు ఆగడం లేదు. అధికార పార్టీ నాయకుల కనుసన్నల్లో మట్టిని అక్రమంగా తవ్వి తరలిస్తున్నారు. శనివారం మరోసారి మట్టి మాఫియా పోలవరం కుడి కాల్వ గట్టును తవ్వేస్తూ, తరలిస్తుండగా టీడీపీ నాయకులు అడ్డుకుని, అధికారులకు అప్పగించారు. కొప్పులవారిగూడెం, లక్ష్మీపురం గ్రామాల సమీపంలో పోలవరం కుడి కాల్వ గట్టును పట్టపగలు యథేచ్ఛగా తవ్వేస్తున్నారు. దీనిని గమనించిన టీడీపీ నాయకులు బొప్పన సుధాకర్, అన్నపనేని సురేష్, ముసునూరి రమేష్, ఈడ్పుగంటి శివ తదితరులు ఆయా ప్రాంతాలకు వెళ్లి గట్టును తవ్వేస్తున్న నాలుగు ఎక్స్‌కవేటర్లు, ఐదు టిప్పర్లను ఆపి, పోలవరం కుడి కాల్వ జేఈ, పెదవేగి తహసీల్దారుకు సమాచారం అందించారు. తహసీల్దారు సూర్యప్రభ స్థానిక వీఆర్వోలను పంపించి, మట్టిని తరలిస్తున్న టిప్పర్లను స్వాధీనం చేసుకున్నారు.

చేసిన పనులకు బిల్లులు చెల్లించండి

- డీపీవో శ్రీనివాస విశ్వనాథ్

కామవరపుకోట, మార్చి 2 : పంచాయతీ ద్వారా కాంట్రాక్టర్లు చేసిన పనులకు బిల్లులు చెల్లించాలని పంచాయతీ కార్యదర్శులను, సర్పంచ్‌లను జిల్లా పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ ఆదేశించారు. తడికలపూడి సచివాలయం వద్ద జరిగిన సమావేశంలో శనివారం ఆయన మాట్లాడుతూ పంచాయతీల్లో పేరుకుపోయిన కరెంటు బకాయిలను చెల్లించాలన్నారు. 2022-23 ఆర్థిక సంవత్సరానికి 15వ ఆర్థిక సంఘం నిధులు రెండు విడతలుగా 545 పంచాయతీలకు రూ.31 కోట్ల 65 లక్షలు జమ అయ్యాయన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి మొదటి విడతగా రూ.32 కోట్లు జమ అయ్యాయని, ఈ నిధుల్లో కేవలం రూ.32 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని, రూ.31 కోట్లు పైబడి ఖర్చు చేయాల్సి ఉందన్నారు. జిల్లాలో రూ.137 కోట్లు మేరకు విద్యుత్ బకాయిలు చెల్లించాల్సి ఉండగా రూ.54 లక్షలు మాత్రమే పంచాయతీలు చెల్లించాయన్నారు. పంచాయతీ ఖాతాల్లో నిధులు ఉన్నందున చేసిన పనులకు బిల్లులు చెల్లించాలని సూచించారు. వేసవి నేపథ్యంలో ఎక్కడా తాగునీటి సమస్య లేకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆయన వెంట ఈవోపీఆర్డీ జి.మరిడయ్య, కామవరపుకోట, తడికలపూడి పంచాయతీ కార్యదర్శులు జి.డి.వి.శ్రీనివాసరావు, జి.వి.సత్యనారాయణ, తడికలపూడి సర్పంచ్ కొత్తపల్లి రజనీ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



సమీక్ష నిర్వహిస్తున్న డీపీవో శ్రీనివాస విశ్వనాథ్

పరీక్షల సమయంలో.. విద్యుత్ కోతలొద్దు!

- విద్యుత్ అధికారులకు జిల్లా అధికారుల ఆదేశాలు
- ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 421 మంది గైర్హాజరు

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 2 : ఇంటర్ పరీక్షలు జరుగుతున్న వేళలతో పాటు, పరీక్షలకు విద్యార్థులు చదువుకునేందుకు వీలుగా రాత్రివేళల్లో విద్యుత్ కోతలు, అవాంతరాలు లేకుండా స్థానిక విద్యుత్ అధికారులు పర్యవేక్షిస్తుండాలని జిల్లా అధికారులు ఆదేశించారు. కొన్ని కేంద్రాల్లో విద్యుత్ అవాంతరాలు తలెత్తుతున్నట్టు వార్తలు రావడంతో ఆ మేరకు ఇంటర్‌బోర్డు అధికారులు విద్యుత్‌శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ప్రతీ పరీక్ష కేంద్రంలోను ప్రథమ చికిత్సా కేంద్రం వద్దవున్న సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ప్రతీ పరీక్ష కేంద్రంలోను విద్యార్థులు ప్రశాంతంగా పరీక్ష రాసుకునే వాతావరణం కల్పించేలా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు చర్యలు తీసుకోవాలని డీవీఈవో ప్రభాకరరావు శనివారం నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో ఆదేశాలు జారీ చేశారు. కాగా శనివారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభమయ్యాయి. తెలుగు/ సంస్కృతం/ హిందీ/ ఉర్దూ సబ్జెక్టుల్లో జరిగిన పరీక్షలకు జిల్లాలో మొత్తం 14,081 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 13,660 మంది హాజరయ్యారు. జనరల్ విభాగంలో 12,184 మంది విద్యార్థులకు 11,894 మంది, ఒకేషనల్ విభాగంలో 1,897 మందికి 1,766మంది హాజరయ్యారు. జిల్లాలో ఎక్కడా అవాంఛనీయ ఘటనలు నమోదు కాలేదని, పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని డీవీఈవో తెలిపారు.



ముదినేపల్లిలో ఇంటర్ పరీక్షలకు హాజరైన విద్యార్థినులు

టెట్‌కు 74మంది గైర్హాజరు

ఉపాధ్యాయ అర్హతా పరీక్షల్లో (టెట్) భాగంగా శనివారం ఉదయం పూట జరిగిన పరీక్షకు జిల్లాలో 328 మంది, మధ్యాహ్నం పూట పరీక్షకు 328 మంది అభ్యర్థులు హాజరయ్యారని, 74 మంది గైర్హాజరైనట్టు డీఈవో అబ్రహం తెలిపారు. పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయ న్నారు.

డీఎస్సీ సందేహాల నివృత్తికి హెల్ప్‌డెస్క్

ఏపీ టెట్, డీఎస్సీ-2024 పరీక్షలకు సంబంధించి అభ్యర్థులకు సందేహాలుంటే నివృత్తి చేసుకునేందుకు విద్యాధికారులతో కూడిన హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేసినట్టు డీఈవో ఎస్.అబ్రహం ఓ ప్రకటనలో తెలిపారు. డీఈవో కార్యాలయ అసిస్టెంట్ డైరెక్టర్ ఫోన్ నెంబరు 94925 15116, సూపరింటెండెంట్ 83281 86618, సీనియర్ అసిస్టెంట్ 90307 23444లలో సంప్రదించాలన్నారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రానికి హాల్‌టిక్కెట్, గుర్తింపు ఐడీలతో పరీక్ష కేంద్రానికి గంట ముందుగా చేరుకోవాలన్నారు.

15 నుంచి డీఎస్సీ ఆన్‌లైన్ పరీక్షలు

ఈ నెల 15నుంచి 30వ తేదీ వరకు కంప్యూటర్ బేస్డ్ (సీబీటీ) విధానంలో డీఎస్సీ ఆన్‌లైన్ పరీక్షలు జరుగనున్నాయి. ఉమ్మడి జిల్లాలో అన్ని పాఠశాల విద్య, మున్సిపల్, ఏపీ రెసిడెన్షియల్, ట్రైబల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్, సోషల్ వెల్ఫేర్ యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల్లో ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్, టీజీటీ కేడర్‌లలో మొత్తం 306 ఉపాధ్యాయ ఖాళీలను డీఎస్సీ రిక్రూట్‌మెంట్‌కు నోటిఫై చేసిన విషయం విదితమే. ఏలూరు జిల్లాలో టెట్ పరీక్షలు జరుగుతున్న మూడు పరీక్షా కేంద్రాల్లోనే డీఎస్సీ ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించగా, పశ్చిమ గోదావరి జిల్లాకు సంబంధించి కేంద్రాల ఎంపికపై కసరత్తు జరుగుతోంది.

కృష్ణకుమారి ఆరోగ్య పరిస్థితిపై ఆరా

ఏలూరు క్రైం, మార్చి 2 : వైసీపీ నాయకుల వేధింపులు భరించలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న కృష్ణకుమారిని అధికారులు పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఏలూరు శ్రీరామ్‌నగర్ 11వ రోడ్డులో నివాసం ఉంటున్న పైడికొండల కృష్ణకుమారికి తన తల్లి గిఫ్ట్ డీడ్‌గా రాసి ఇచ్చిన 336 గజాల స్థలాన్ని ఆక్రమించడానికి వైసీపీ నాయకులు వేధింపులకు పాల్పడ్డారు. అర్ధరాత్రి వేళ దాడి చేయడానికి ప్రయత్నించారు. వారి వేధింపులు భరించలేక కృష్ణకుమారి ఈనెల 1వ తేదీన పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. తీవ్ర అస్వస్థతకు గురైన ఆమె ప్రస్తుతం ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఏలూరు తహసీల్దార్, త్రీటౌన్ సీఐలు శనివారం ఉదయం ఆస్పత్రికి వచ్చి ఆమె ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను ఆరా తీశారు. 48 గంటల గడిచే వరకు తాము ఏమి చెప్పలేమని, ఆమె ఎక్కువ మోతాదులో పురుగుల మందు తాగిందని పరిస్థితి ప్రమాదకరమేనని వైద్యులు వివరించారు. మరోవైపు కృష్ణకుమారి భర్త శ్రీనివాస్ నుంచి స్థల వివాదంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.

తాబేళ్ల దొంగలు!

కొల్లేరు కేంద్రంగా అక్రమ రవాణా!

- పొరుగు రాష్ట్రాలకు సరఫరా
- లక్షల్లో జేబులు నింపుకుంటున్న అక్రమార్కులు
- పట్టించుకోని అధికారులు



కైకలూరు, మార్చి 2 : విదేశీ, స్వదేశీ విహంగాలు, అనేకరకాల మత్స్య జాతులకు కొల్లేరుకు ప్రసిద్ధి చెందింది. తాబేళ్లు సైతం ఇక్కడ ఎక్కువగా కన్పిస్తాయి. వీటిపై కన్నుపడిన కొంతమంది అక్రమార్జన కోసం కొల్లేరును కేంద్రంగా చేసుకుని వివిధ రాష్ట్రాలకు దశాబ్దకాలంగా తాబేళ్ల అక్రమ రవాణా సాగిస్తున్నారు. కాల్వలు, మురుగు డ్రెయిన్లు, చిన్నచిన్న నీటికుంటల్లో ఇవి పుష్కలంగా సంచరిస్తుంటాయి. చెరువుల్లో చేపల పట్టుబడుల సమయంలో, కొల్లేరులో చేపల పట్టే సమయంలో చేతికి చిక్కిన తాబేళ్లను కూలీలు, మత్స్యకారులు దాచి ఉంచుతారు. కైకలూరు, కలిదిండి, మండవల్లి, ముదినేపల్లి మండలాల్లోని గ్రామాల్లో ఇలా సేకరించిన తాబేళ్లను కొంతమంది కొంటున్నారు. తాబేలు సైజును బట్టి ధర నిర్ణయిస్తారు. పెద్దగా ఉన్న వాటికి రూ.30 వరకు వెల కడుతుంటారు. ఇలా పోగు చేసిన వాటిని డ్రమ్ముల్లోనూ, గోనె సంచుల్లో ఖాళీ ప్రదేశాల్లో, చెరువు గట్లపైన నిల్వ ఉంచుతుంటారు. ఇవి టన్నుల్లో దొరికిన తర్వాత కర్ణాటక, గోవా, అసోం తదితర ఇతర రాష్ట్రాలకు వ్యానుల ద్వారా రవాణా చేస్తూ లక్షల్లో ఆదాయాలను పొందుతున్నారు. ఇతర రాష్ట్రాల్లో వీటి మాంసానికి మంచి గిరాకీ ఉంది. సుమారు కేజీ రూ.400 చొప్పున కొనుగోలు చేస్తుంటారు. వ్యానుల్లో అడుగు భాగంలో తాబేళ్లను ఉంచి పైన చేపల ట్రేలను ఉంచి తీసుకెళ్తుంటారు. జిల్లాల సరిహద్దుల్లో వీటిని తనిఖీ చేసినా చూసేవారికి చేపల రవాణా అవుతున్నట్టుగానే ఉంటుంది. కొన్ని చెక్‌పోస్టుల్లో గుర్తించినా మామూళ్లు దండుకుని వదిలివేస్తుంటారు. ఒక్కొక్క వ్యానులో సరఫరా చేసిన తాబేళ్ల వల్ల సుమారు రూ.2లక్షలు ఖర్చులు పోను మిగులుతుంటాయి. ఇటీవల పోలీసుల తనిఖీల్లో పలు వాహనాల్లో అక్రమ తాబేళ్లను గుర్తించి కేసులు నమోదు చేసినా ఈ దందా కొనసాగుతూనే ఉంది. గతేడాది ఫిబ్రవరి 27వ తేదీన కైకలూరు మండలం వదర్లపాడు బ్రాంచి వద్ద పోలీసుల తనిఖీల్లో ఒక ఆటో, మినీ వ్యానులో 25 గోనె సంచిల్లో సుమారు 4 క్వింటాల తాబేళ్లను గుర్తించి ముగ్గురిని అరెస్టు చేశారు. ఈ తాబేళ్లను తణుకుకు తీసుకువెళ్లి అక్కడి నుంచి ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్న ట్టు పోలీసులు గుర్తించారు. ఇటీవల కలిదిండి మండలం సానారుద్రవరంలో అర్ధరాత్రి సమయంలో వ్యానులోనికి తాబేళ్లను ఎక్కిస్తున్నవారిని పోలీసులు అరెస్టు చేసి 40 బస్తాల్లో సుమారు 2వేల కేజీల తాబేళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఇలా స్వాధీనం చేసుకున్న వాటిని అటవీశాఖ సిబ్బందికి అప్పగించి తిరిగి కొల్లేరు సరస్సులో వదిలివేస్తున్నారు. వీటిని అక్రమ రవాణా చేస్తున్న వ్యక్తులపై కఠినమైన చర్యలు తీసుకుంటే తాబేళ్ల మనుగడను కాపాడవచ్చని పలువురు పేర్కొంటున్నారు.



స్వాధీనం చేసుకున్న తాబేళ్లను అటపాక వద్ద కొల్లేరులోకి వదులుతున్న అటవీశాఖ అధికారులు (ఫైల్)

వైసీపీ నేతల చేతుల్లో పింఛన్ల సొమ్ము

» వలంటీర్లను తప్పించి పంపిణీ



పాలకొల్లు 2వ వార్డు, వెలివెల గ్రామంలో పింఛన్ సొమ్ము అందచేస్తున్న వైసీపీ నాయకులు



పాలకొల్లు, మార్చి 2 : ఇంటింటా పంపిణీ చేయాల్సిన పింఛన్ల ప్రజాధనం వైసీపీ నేతల చేతుల్లోకి చేరింది. మార్చి నెల పింఛన్ సొమ్ములు వారే వీధి వీధి తిరుగుతూ బాహాటంగా లబ్ధిదారులకు అందించి తమ పార్టీకి అనుకూల ప్రచారాన్ని చేపట్టారు. పాలకొల్లులో జరిగిన ఈ ఘటనతో అందరూ అవాక్కయ్యారు. దీని వెనుక మున్సిపల్, మండల పరిషత్, గ్రామ సచివాలయ అధికారులతో పాటు వాలంటీర్ల పాత్ర ఉందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. నియోజకవర్గ పరిధిలో పాలకొల్లు పట్టణం, పాలకొల్లు, యలమంచిలి, పోడూరు మండలాల్లో నిన్న పలుచోట్ల వైసీపీ కార్యకర్తలే పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని బాహాటంగా చేపట్టారు. పట్టణంలోని 1, 2, 6, 10, 17, 23వ వార్డుల్లో అలాగే మండలాల్లోని అయాగ్రామాల్లో వైసీపీ నాయకులే ఇంటింటికీ వెళ్లి పింఛన్ సొమ్ము అందించారు. ఈపింఛన్ సొమ్ములు పంపిణీ చేసిన కొందరు వైసీపీ నాయకులు, కార్యకర్తలు అయితే బాహాటంగా వచ్చే ఎన్నికల్లో వైసీపీకి ఓట్లు వేసి గెలిపించాలని కోరుతూ పింఛన్ సొమ్ము చేతిలో పెట్టిన వైనం కనిపించింది. అసలు ఈప్రభుత్వ ప్రజాధనం ముందుగా వైసీపీ నేతల చేతుల్లోకి ఎలా వెళ్లిందనే ఆశ్చర్యం కలిగిస్తుంది. మరో వైపు కొన్నిచోట్ల వాలంటీర్లు ప్రేక్షకపాత్ర వహిస్తూ వైసీపీ నేతల చేతుల మీదుగా పింఛన్ సొమ్ములు పంపిణీ చేయించిన సంఘటనలు చోటు చేసుకున్నాయి.

మంచుటెండలు



» తారెత్తిస్తున్న ఎండలు.. రాత్రి చలి, పొగమంచు

పగలు భానుడి ప్రతాపంతో జిల్లా ప్రజలు విలవిల్లాడుతున్నారు. రాత్రయితే చలి, పొగమంచుతో వింత వాతావరణ పరిస్థితులు నెలకొంటున్నాయని ప్రజలు బెంబేలెత్తుతున్నారు. మార్చి ఆరంభంలోనే ఎండలు మండుతుండడంతో రానురాను తీవ్రమవుతాయని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు.



ఏలూరు రూరల్, మార్చి 2: విభిన్న వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. ఉదయం వేళల్లో సూర్యుడి ప్రతాపానికి ప్రజలు తారెత్తిపోతున్నారు. రాత్రి అయితే చలి, ఉదయం దట్టమైన పొగమంచు కురుస్తోంది. వారం రోజులుగా వింత వాతావరణంతో వృద్ధులు, చిన్నారులు అనారోగ్యం పాలవుతున్నారు. ముందు తుఫాన్ కారణంగా వర్షాలు, ఉదయం ఎండల తీవ్రత, తెల్లవారు జామున మంచు ప్రభావంతో ఇబ్బందులు పడ్డారు. కొన్ని ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరిగాయి. శనివారం ఉదయం ఎనిమిది గంటలు దాటినా దట్టమైన పొగమంచుతో రహదారి పై ప్రయాణం చేయాలంటే కత్తిమీద సాముగా మారింది. ఈ ఏడాది వేసవిలో వేడి తీవ్రమై, వడగాల్పులు వీస్తాయని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. మార్చిలోనే సూర్యుడు భగ్గుమంటున్నాడని, రానున్న రోజులలో పరిస్థితి ఎలా ఉంటుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

శ్రీవారి ఆలయానికి పోటెత్తిన భక్తులు



మండపంలో భక్తుల రద్దీ

ద్వారకాతిరుమల, మార్చి 2: చినవెంకన్న ఆలయం శనివారం భక్తులతో కళకళలాడింది. శ్రీవారికి ప్రీతికరమైన రోజు అవడంతో భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. భక్తులు మొక్కుబడులను తీర్చుకొని, స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. దీంతో ఆలయం రద్దీగా మారింది.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



మానవహారం నిర్వహిస్తున్న డ్వాక్రా మహిళలు

పాలకోడేరు, మార్చి 2 : పెరట్లో ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం, ఆదాయం పెంచుకోవచ్చని జోనల్ కో ఆర్డినేటర్ అరుణ అన్నారు. పాలకోడేరు మండల సమాఖ్య కార్యాలయంలో డ్వాక్రా మహిళలకు ప్రకృతి వ్యవసాయంపై ఏపీఎం భారతి ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. అరుణ మాట్లాడుతూ రైతు సాధికారిత సంస్థ మండల సమాఖ్య ఆధ్వర్యంలో గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరించే దిశగా సహకరించాలన్నారు. ప్రకృతి వ్యవసాయ ఐసీఆర్పీలు వీరేంద్ర, రవి, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు. అనంతరం డ్వాక్రా మహిళలకు ఓటు హక్కు వినియోగంపై ఏపీఎం భారతి ఆధ్వర్యంలో మానవహారం నిర్వహించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



ఏలూరు రూరల్, మార్చి 2 : పంచాయతీరాజ్ ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. స్థానిక జడ్పీ కార్యాలయంలో శనివారం ఎన్నికల అధికారి కె.ప్రసన్న, ఏపీపీఆర్ ఎంఈవో జిల్లా సంఘం ఆధ్వర్యంలో ఎన్నికల పరిశీలకునిగా గొన్నూరి శ్రీధర్ రాజు, అధ్యక్షతన ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం పరిషత్ యూనిట్, ఏలూరు (జడ్పీ యూనిట్) కో-ఆప్షన్ ఎన్నికలు ఏకగ్రీవంగా ముగిశాయి. ఏవోఎస్ ప్రకాష్, కె.నరసింహమూర్తి, ఎస్.కనకదుర్గా కుమారి, సంఘ సభ్యులు హాజరయ్యారు. నూతన ఆఫీస్ బేరర్‌లను పూలమాలతో అభినందించారు.

కాలుష్య కోరల్లో అన్నయ్యకోడు ఛానల్



పంట కాల్వలోకి వస్తున్న కలుషిత నీరు

కాళ్ల మార్చి 2 : సుమారు పది గ్రామాలకు త్రా గునీరు అందించే పంట కాలు వని ఆక్వా చెరువుల యాజమాన్యం కలుషితం చేస్తున్నారని శివారు గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. కాళ్ల మండలం జువ్వలపాలెం గ్రామ పరిధిలో అన్నయకోడు పంట కాలువను, రహదారిలోకి అనుకుని ఉన్న చేపల చెరువు నీరు నేరుగా వదిలేయడంతో శివారు గ్రామాల ప్రజల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రాతాళ్ళమెరక, పల్లిపాలెం, కలవపూడి, మోడి, బోస్‌కాలనీ తదితర గ్రామాలకు ఈ పంటకాలువ ద్వారా త్రాగునీరు, సాగునీరు అందుతుంది. అయితే గురువారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా మోటార్ ఇంజన్ సహాయంతో కాలువలోకి వ్యర్థ జలాలను వదులుతున్నా సంబంధిత అధికారు లు కనీసం పట్టించుకోకపోవడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మంచినీటి చెరువులకు నీరు నింపుకునే సమయంలో చేపల చెరువులో నీరు వదిలేయడంతో మంచినీటి చెరువులకు నీళ్లు ఎలా పెట్టుకోవాలని పలువురు ప్రశ్నిస్తున్నారు. ప్రక్కనే మురుగు కాలువ ఉన్నప్పటికీ నిర్లక్ష్యంగా చేపల చెరువులో నీరు వదలడంపై శివారు గ్రామాల ప్రజలు అనారోగ్యం బారిన పడితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నిస్తున్నారు. అధికారులు వెంటనే స్పం దించి పంటకాలువలో వదులుతున్న నీటిని నిలుపుదల చేసి సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

శాశ్వత లోక్‌అదాలత్‌లో సత్వర న్యాయం



ఏలూరు క్రైం, మార్చి 2 : పర్మినెంట్ లోక్ అదాలత్ త్వరితగతిన న్యాయసేవలను పొందవచ్చునని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా శాశ్వత లోక్‌అదాలత్ ఛైర్‌పర్సన్ ఎ మేరీ గ్రేస్ కుమారి అన్నారు. జిల్లా కోర్టు ఆవరణలో లోక్ అదాలత్ భవనంలో అధికారులతో సదస్సు నిర్వహిం చారు. మానవ జీవితం చాలా చిన్నదని కక్షలు పెంచుకుని జీవించకూడదని, సఖ్యతపడి మంచిగా జీవించాలన్నారు. త్వరితగతిన సమస్యలను పరిష్క రించుకోవడానికి పర్మినెంట్ లోక్‌అదాలత్ ఎంతో సులభమార్గమన్నారు. వాయు మార్గం, జలమార్గం, రోడ్డు మార్గం ద్వారా ప్రయాణీకులను, సరుకులను రవా ణా చేసే సేవల సౌకర్యం, తంతితపాలా, టెలిఫోన్ సేవలు, విద్యుత్ శక్తి, కాంతి, నీరు ప్రజలకు సరఫరా చేసే సంస్థలు, ప్రజారక్షణ, పారిశుధ్యం, వైద్య శాలల చికిత్సాలయాల్లో అందించే ఆరోగ్య సేవలు, జీవిత భీమా సేవలు, బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థలు, జాతీయ గ్రామీణ ఉపాధి పథకం, విద్య విద్యా సంస్థల సేవలు, గృహాలు, రియల్ ఎస్టేట్ సేవలలో తలెత్తే సమస్యలను ఈ పర్మినెంట్ లోక్‌అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చునని ఛైర్‌పర్సన్ మేరీ గ్రేస్ కుమారి సూచించారు.

పోక్సో చట్టంపై అవగాహన తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న మొదటి అదనపు న్యాయాధికారి

ఏలూరు క్రైం, మార్చి 2 : లైంగిక నేరాల నుంచి చిన్నారుల రక్షణకు ఫోక్సో చట్టాన్ని ప్రవేశపెట్టారని మొదటి అదనపు జిల్లా న్యాయధికారి రామ్‌గోపాల్ అన్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, ప్రధాన న్యాయమూర్తి పురుషోత్తమకుమార్ ఆధ్వర్యంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని పోలీసు ఉన్నతాధికారులతో ఫోక్సో చట్టం, బాధితులకు పరిహారం, ఎన్‌డిపిఎస్ చట్టాలపై అవగాహన సదస్సు ఎస్పీ కార్యాలయంలో నిర్వహించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రత్నప్రసాద్ అధ్యక్షత వహించారు. మొదటి అదనపు జిల్లా న్యాయాధికారి రామ్‌గోపాల్ మాట్లాడుతూ ఫోక్సో చట్టం లైంగిక నేరాల నుంచి చిన్నారులకు రక్షణ కల్పించేందుకని తెలిపారు. 2012 నుంచి ఈ చట్టం అమలులోకి వచ్చిందన్నారు. చట్టాలపై అన్ని శాఖల అధికారులకు ఎప్పటికప్పుడు అవగాహన ఉంటే ప్రజలకు నాణ్యమైన సేవలు అందుతాయన్నారు. ఈ సదస్సులో 8వ అదనపు జిల్లా జడ్జి ఎం సునీల్ కుమార్ కోర్టులలో సమన్లను వారెంట్లను ఎన్‌స్టెప్ ఆన్లైన్ విధానంలో అమలు చేస్తున్నారని రాష్ట్రంలో మొదటిసారిగా ఏలూరులో ఎస్సీ ఎస్టీ కోర్టు, మొబైల్ కోర్టులను ఎన్నుకొన్నారని తెలిపారు. జిల్లాలో 25 పోలీస్ స్టేషన్లలో 25 మంది కానిస్టేబుల్స్‌ను నియమించామని, ప్రతిరోజు ఆన్లైన్ విధానంలో నోటీసులను వారెంట్లను పంపి త్వరితగతిన బాధితులు న్యాయం పొందేలా ఈ పైలెట్ ప్రాజెక్టును రూపొందించారని తెలిపారు. ఎస్పీ మేరీ ప్రశాంతి మాట్లాడుతూ ఫోక్సో చట్టం బాధితులకు న్యాయం చేయాలన్నారు. శాశ్వత లోక్ అదాలత్ ఛైర్‌పర్సన్ ఎ మేరీ గ్రేస్‌కుమారి మాట్లాడుతూ మైనర్ బాలికల కిడ్నాప్‌లు అరికట్టాలన్నారు. మొదటి అదనపు జిల్లా జడ్జి జి రామ్‌గోపాల్, జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి, 8వ అదనపు జిల్లా జడ్జి ఎం సునీల్‌కుమార్, శాశ్వత జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ ఎ మేరీ గ్రేస్ కుమారి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అడిషనల్ జిల్లా ఎస్పీ స్వరూపరాణి, న్యాయమూర్తులు, న్యాయవాదులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వన్‌గ్రామ్ గోల్డ్ ధగధగలు

మిరుమిట్లు గొలిపే మోడళ్లు...ఆభరణాలకు పెరుగుతున్న డిమాండ్





జంగారెడ్డిగూడెం టౌన్, మార్చి 2 : వన్‌గ్రామ్ గోల్డ్ ఆభరణాలకు రోజురోజుకు డిమాండ్ పెరుగుతోంది. బంగారం ధరలు రోజురోజుకు పెరగడంతో మహిళలు వన్‌గ్రామ్ ఆభరణాలపై ఆశక్తి చూపుతున్నారు. దొంగలు దోచేస్తారనే భయం లేకపోవడం, తక్కువ ధరలో లభించడంతో వీటిపై మక్కువ చూపుతున్నారు. చిన్నపిల్లల నుంచి పెద్దల వరకు ఈ ఆభరణాలు దొరుకుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక దుకాణాలలో, ఫ్యాన్సీ స్టోర్లలోనూ విక్రయిస్తున్నారు. ఇవి హైద్రాబాద్, విజయవాడ, తమిళనాడులో తయారవుతాయని విక్రయదారులు అంటున్నారు. బంగారం కొనుగోలు చేయడం ఒకెత్తు అయితే వాటిని భద్రపరచడం మరొకెత్తని పలువురు వాపోతున్నారు. వన్‌గ్రామ్ గోల్డ్‌లోనే అనేక రకాల మోడళ్లు లభిస్తున్నాయి. ఎక్కువకాలం మన్నుతున్నాయని మహిళలు అంటున్నారు.

వన్‌గ్రామ్ గోల్డ్ ధరల వివరాలివి..

వడ్డాణం ధర రూ.500 నుంచి 3వేలు అనేక మోడళ్లు అందుబాటులో ఉన్నాయి. చేతిగాజులు రూ.200 నుంచి వెయ్యి విక్రయిస్తున్నారు. హారాలు, నల్లపూసలు 300 నుంచి రూ.2500 ధర పలుకుతున్నాయి. పాపిడి బిళ్ళలు రూ.100 నుంచి 500 విక్రయిస్తున్నారు.

మంచి డిజైన్లలో వస్తువులు



వన్‌గ్రామ్ గోల్డ్ ఆభరణాలు ధరించి శుభకార్యాలకు వెళ్లిన ఆందోళన ఉండదు. మంచి డిజైన్‌లలో వస్తువు లు లభిస్తున్నాయి. బంగారాన్ని మించి మెరిసే వన్‌గ్రా మ్ గోల్డ్ ఆభరణాలు మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి.

- కొప్పుల రాణి, ఉద్యోగి

సీజన్‌లో అమ్మకాలు అధికం..

శుభకార్యాల సీజన్‌లో అమ్మకాలు ఎక్కువగా ఉంటాయి. విజయవాడ, హైద్రాబాద్, ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి అవుతుంటాయి. పేద, మధ్య తరగతి కటుంబాలే కాకండా ధనిక కుటుంబాలు కూడా ఈ వస్తువులను కొనుగోలు చేస్తున్నారు. జాగ్రత్తగా వాడుకుంటే మన్నిక ఉంటుంది.

- ఎస్. రమేష్, వ్యాపారి



బైపాస్ రోడ్డు నుంచి బంగారువారి చెర్వుగట్టుకు వెళ్లే మునిసిపల్ రోడ్డు



కె ఇల్లిందలపర్రులో గోతుల మయంగా రహదారి

ఇవేం రోడ్లు బాబోయ్

» గోతులతో రాళ్లుతేలి ప్రమాదకరంగా రహదారులు

» అధికారులు పట్టించుకోవాలని గ్రామస్థుల వినతి

బాగు పడని యాళ్లవానిగర్వు పంచాయతీ రోడ్డు

పాలకొల్లు రూరల్, మార్చి 2 : పాలకొల్లు మునిపాలిటీకి అనుకుని ఉన్న యాళ్లవానిగర్వు పంచాయతీ రోడ్లు అభివృద్ధిలో కుంటుపడ్డాయి. ఐదు సంవత్సరాలుగా కోట్ల రూపాయలు యాళ్లవానిగర్వు పంచాయతీకి ఆదాయం ఉన్నప్పటికీ కనీసం రోడ్ల మరమ్మతులు కూడా చేపట్టకపోవడం శోచనీయమని ప్రజలు వాపోతున్నారు. బంగారువారి చెర్వుగట్టు నుంచి బ్రాడీపేట బైపాస్ వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉంది. ఈరోడ్డు సగభాగం పాలకొల్లు మున్సిపాలిటీలోనూ మిగిలిన సగ భాగం యాళ్లవానిగర్వు పంచాయతీ పరిధిలో ఉంది. పాలకొల్లు పట్టణ ప్రజలు వేలాది మంది ఈరోడ్డుపైనే ప్రయాణిస్తుంటారు. దీంతో రోడ్డు బాగోక రోజూ ఇబ్బందులు పడుతూ ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఏరియా ప్రజలు అనేక సార్లు అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన చెందుతున్నారు. గతంలో 'ఆంధ్రజ్యోతి' లో వచ్చిన రోడ్డు దుస్థితి కథనంపై మున్సిపాలిటీ అధికారులు స్పందించి మున్సిపాలిటీ మేర రోడ్డుపై మెటల్ వేసి చేతులు దులుపుకున్నారు. మిగిలిన రోడ్డు యాళ్లవానిగర్వు పంచాయతీ అధికారులు ఎప్పుడు వేస్తారా అని ఏరియా ప్రజలు ఎదురుచూస్తున్నారు.

రెండుసార్లు గాయపడ్డాను



ఈ రోడ్డు పెద్ద గోతులతో అధ్వానంగా ఉంది. రోడ్డుపై వెళ్తూ గోతుల్లో పడి రెండుసార్లు గాయపడ్డాని బంగారువారి చెర్వుగట్టుకు చెందిన కాయల నాగేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం రోడ్డు గుంతలు కూడా పూడ్చకుండా అధి కారులు మొద్దునిద్రలో ఉన్నారని ధ్వజమెత్తారు.

కాయల నాగేశ్వరరావు, బంగారువారి చెర్వుగట్టు

రోడ్లు అధ్వానం

ఇరగవరం, మార్చి 2 : మండలంలో రహదారులు అధ్వానంగా ఉన్నాయి. గోటేరు నుంచి ఇరగవరం వెళ్ళే 4 కిలోమీటర్ల రహదారి పూర్తిగా ధ్వంసమై ప్రమాదకరంగా మారింది. కె ఇల్లిందలపర్రు -తూర్పువిప్పరు రహదారి గోతుల మయంగా మారి కంకర తేలి అధ్వానంగా ఉంది. అడుగుకో గొయ్యిపడి ప్రయాణం నరకంగా మారిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కంతేరు, కత్తవపాడు, ఇరగవరం, తూర్పువిప్పర్రు, కె ఇల్లిందలపర్రు గ్రామాల ప్రజలు, అధిక సంఖ్యలో కార్మికులు, ఉద్యోగులు ఈ రహదారిపై తణుకు పట్టణానికి ప్రయాణం సాగిస్తారు. కనీసం గుంతలు పూడ్చకపోవడంతో రాత్రి సమయాల్లో ప్రమాదాలకు గురవుతు న్నామని వాపోతున్నారు. ప్రజా ప్రతినిధులు, అధి కారులు వెంటనే స్పందించి రహదారికి మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.



సైకిల్‌పై అయోధ్యకు..

మొగల్తూరు, మార్చి 2 : మొగల్తూరు లాకుపల్లవపాలెంకు చెందిన కొల్లాటి రాధాకృష్ణ శనివారం మొగల్తూరు నుండి సైకిల్‌పై శనివారం ఆయోధ్యకు బయలుదేరాడు. ఆయోధ్యలో రామజన్మభూమి స్థలంలో శ్రీరాముడు ఆలయ ప్రారంభం సమయానికి సైకిల్‌పై వెళదామనుకున్నానని అనివార్య కారణాలతో ఆసమయంలో వెళ్ళలేదన్నారు. శ్రీరాముడుపై తనకు భక్తిభావం రాముడును దర్శింపచాలని తలంచానన్నారు. దీంతో తాను ప్రత్యేకంగా సైకిల్‌పై వెళుతున్నానని తెలిపారు. మొగల్తూరు గాంధీ బొమ్మల సెంటర్‌లో పలువురు రామ భక్తులు ఆయనను కలిసి క్షేమంగా వెళ్ళిరావాలని ఆకాంక్షించారు.



అయోధ్యకు బయలుదేరిన కొల్లాటి రాధాకృష్ణ

వాటర్ ట్యాంకుకు వైసీపీ రంగులు

ఉంగుటూరు, మార్చి 2 : ఉంగుటూరు మండలం అక్కుపల్లిగోకవరం గ్రామంలో నిర్మిస్తున్న రక్షిత మంచినీటి పథకం ఓవర్ హెడ్ ట్యాంకుకు వైసీపీ రంగులు వేయడంతో స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై అధికార పార్టీ నాయకుల ప్రచారం తీవ్ర స్థాయికి వెళ్లిందని విమర్శలు వినిపిస్తున్నాయి. తాగునీటిని రాజకీయంగా ఉపయోగించుకుంటారా అని విమర్శిస్తున్నారు.

క్రైం కార్నర్

తల్లి కుమార్తె ఆత్మహత్యాయత్నం

ఏలూరు క్రైం, మార్చి 2 : తరచు అనుమాన పడుతూ పుట్టింటికి పంపించి ఆపై తమ బాగోగులు చూస్తాడో లేదోనని జీవితంపై విరక్తి చెందిన ఓ తల్లి పురుగు మందు తాగి తన రెండున్నర సంవత్సరాల బిడ్డకు పట్టించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాలివి.. కృష్ణయ్యపాలెంనకు చెందిన అట్రగడ్డ దుర్గా ప్రసాద్‌కు నాలుగేళ్ళ క్రితం ఉంగుటూరులోని ప్రియాంక (24)తో వివాహమయ్యింది. వీరికి రెండున్నర సంవత్సరాల కుమార్తె కారుణ్య ఉంది. ప్రసాద్ హైదరాబాద్‌లో వాచ్‌మెన్‌గా పని చేసేవాడు. తరువాత కృష్ణయ్యపాలెం వచ్చేశారు. భార్యపై అనుమానంతో శారీరకంగా, మానసికంగా వేధించేవాడు. రెండు నెలల క్రితం ఆమెను పుట్టింటికి పంపిం చేశాడు. ఫోను కూడా చేయకపోవడంతో పెద్దలు కృష్ణయ్యపాలెం వెళ్లి మాట్లాడారు. ఈ నెల 6న ప్రియాంకను కాపురానికి తీసుకువెళ్తానని దుర్గా ప్రసాద్ పెద్దలకు హామీ ఇచ్చాడు. ఇదే విషయం పెద్దలు ప్రియాంకకు నచ్చజెప్పారు. తాను అక్కడకు వెళ్ళినా వేధింపులకు గురి కావాల్సిందేనని తీవ్ర మనస్తాపంతో గుర్రై విష గుళికలను నీటిలో కలుపుకుని శనివారం తాగి కొంత నీటిని తన కుమార్తెకు పట్టించింది. పరిస్థితి తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్నారు. ఈ సంఘటనపై ఎమ్మెల్సీ నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

చెరువులో పడి యువకుడి మృతి



లింగపాలెం, మార్చి 2: యడవల్లిలో చెరువులో పడి యువకుడు మృతి చెందిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే గ్రామానికి చెందిన తుమ్మలపల్లి రాజేష్ (28) ఈత కోసం చెరువులో దిగాడు. లోతు ఎక్కువగా ఉండటం వలన యువకుడు మునిగిపోయాడు. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారమివ్వడంతో పోలీసుల సహాయంతో మృతదేహాన్ని బయటకు తీశారు. పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ చెన్నారావు తెలిపారు.

ఉరి వేసుకొని ఒకరి ఆత్మహత్య



లింగపాలెం, మార్చి 2: కలరాయినిగూడెంలో ఉరి వేసుకొని ఒక వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలివి.. జాలా ఏసు (58) ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్టు తెలిపారు. మృతుడు గతంలో రెండుసార్లు ఆత్మహత్యాయత్నం చేశాడన్నారు. శుక్రవారం రాత్రి మద్యం మత్తులో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకొన్నాడు. కుటుంబసభ్యులు గమనించి పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్ఐ చెన్నారావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడికి భార్య కుమార్తె, కుమారుడు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జీసీసీ గొడౌన్ ఇన్‌చార్జిపై కేసు

కుక్కునూరు, మార్చి 2 : కుక్కునూరు గిరిజన సహకార సంస్థ (జీసీసీ) గొడౌన్ ఇన్‌చార్జి సీహెచ్ వీర్రాజుపై కేసు నమోదు చేసినట్టు కుక్కునూరు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. దాదాపు 30 టన్నుల బియ్యం ప్రక్కదారి పట్టినట్టు సివిల్ సప్లై అధికారుల తనిఖీల్లో వెల్లడైంది. ఈ క్రమంలో కేసు నమోదు చేశారు.

అత్యాచారం కేసు నమోదు

అత్తిలి, మార్చి 2 : అత్తిలి మండలం ఓ గ్రామానికి చెందిన యువకుడు తన కుమార్తెను బలవంతంగా అత్యాచారం చేశారంటూ తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. తన భర్త ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్ళాడని, తన కుమార్తె ఇంటి వద్దే ఉంటోందని తెలిపింది. గత నెల 18వ తేదీ రాత్రి తమ కుమార్తె(14) నిద్రిస్తున్న గదిలోకి చొరబడి అత్యాచారం చేశాడని ఫిర్యాదు చేసింది. తిరిగి 26వ తేదీ రాత్రి కుమార్తె నిద్రిస్తున్న గదిలోకి వచ్చి బెదిరించి అత్యాచారం చేశాడని ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ వి.రాంబాబు తెలిపారు.

కారులో బంగారం చోరీ



ద్వారకాతిరుమల, మార్చి 2: శ్రీవారి దేవస్థానం పార్కింగ్ ప్రాంతంలో ఉంచిన భక్తుని కారునుండి ఓ అంగంతకుడు భారీ చోరీకి పాల్పడ్డాడు. అందులో ఉంచిన సుమారు 17 కాసుల 2 గ్రాముల బంగారం అపహ రించారు. ఈ మేరకు బాధితుడు ఫిర్యాదు చేశాడు. వివరాలివి..విశాఖ జిల్లా గాజువాకకు చెందిన కిరీటం సత్యభాస్కరరావు భార్యతో రావులపాలెంలోని బంధువుల ఇంట శుభకార్యానికి హాజరై తిరుగు ప్రయాణంలో ద్వారకా తిరుమలకు వెళ్లారు. కారును దేవస్థానం పార్కింగ్ వద్ద ఉంచి దర్శనానికి వెళ్లి వచ్చేసరికి కారు డేష్ బోర్డులో 17 కాసుల 2 గ్రాముల బంగారు వస్తువులు మాయమైనట్లు గుర్తించి లబోదిబోమన్నారు. లాక్ చేసిన కారులో బంగారం మాయమవడంతో ఆవేదన చెందారు. దీంతో పోలీసులను ఆశ్రయించారు. ఈ క్రమంలో పోలీసులు సిసి కెమేరాలను పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సతీష్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు



ఉంగుటూరు, మార్చి 2 : నారాయణపురం మురుగు కాల్వ వద్ద శనివారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. దీంతో నిడమర్రు మండలం పత్తేపురం గ్రామానికి చెందిన దంపతులు గాయపడ్డారు. భువనపల్లి నుంచి నారాయణపురం వస్తుండగా జరిగిన ఈ ప్రమాదంలో దంపతులకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని చూసి విషయం తెలుసుకుని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పత్సమట్ల ధర్మరాజు పరామర్శించి వారిని తమ వ్యక్తిగత వాహనంలో ఏలూరు ఆశ్రం ఆసుపత్రికి తరలించారు.



పతకాలు అందుకున్న విద్యార్థులు, డ్రాయింగ్ టీచరుకు సత్కారం

చిత్రలేఖన పోటీల విజేతలకు బహుమతులు

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 2: నెహ్రూ యువకేంద్ర అనుబంధ సంస్థ డ్రీమ్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఆన్‌లైన్ విధానంలో నిర్వహించిన జాతీయస్థాయి చిత్రలేఖనం పోటీల్లో ఏలూరు రూరల్ మండలం శనివారపుపేట జడ్పీ హైస్కూలు విద్యార్థులు బహుమతులు సాధించారు. గుంటూరులోని కేఎల్.యూనివర్సిటీలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో విజేతలకు పతకాలు, ప్రశంసాపత్రాలను ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా డైరెక్టర్ ఎం.లక్ష్మీకాంతరెడ్డి, జాస్తి అనంత పద్మశేఖర్ అందజేశారు. వివరాలను స్కూలు డ్రాయింగ్ ఉపాధ్యాయుడు ఎండి. ఇర్షాద్ అహ్మద్ తెలియజేశారు. ఆన్‌లైన్ పోటీలకు దేశవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి విద్యార్థులు రిజిస్టర్ చేసుకోగా సందేశాత్మక చిత్రాలను ప్రామాణికంగా తీసుకుని విజేతలను ఎంపిక చేశారని వివరించారు. శనివారపుపేట జడ్పీ హైస్కూలు విద్యార్థులు కె.ప్రేమ్‌కుమార్, ఎల్.భానుప్రకాష్, సీహెచ్.యతిక్‌రమీ, కె.తేజశ్రీకి స్వర్ణ పతకాలు, కె.గాయత్రి, ఆర్.యమున, ఎం.లిఖితరాణి, బి.ప్రణతిలకు రజత పతకాలు లభించాయని వివరించారు. ఒకే స్కూలు నుంచి ఇంతమంది విద్యార్థులు బహుమతులకు ఎంపిక కావడం విశేషమన్నారు. విజేతలను స్కూల్ హెచ్‌ఎం ప్రకాశరావు తదితరులు అభినందించారు.

పిల్లల పోషణపై పర్యవేక్షణ ఉండాలి



సూచనలు ఇస్తున్న సీడీపీవో విజయలక్ష్మి

పెదవేగి, మార్చి 2: పిల్లల ఎత్తు, బరువు ఎప్పటికప్పుడు సరిచూస్తూ పోషణ పై పర్యవేక్షణ ఉండాలని సీడీపీవో కె.విజయలక్ష్మి అంగన్‌వాడీలకు సూచించారు. పెదవేగి, విజయరాయిలో శనివారం అంగన్‌వాడీ సెక్టారు సమావేశం నిర్వహించారు. సీడీపీవో మాట్లాడుతూ మాతా, శిశు సంరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. పిల్లల ఆరోగ్య సంరక్షణకు అనువుగా పోషకాహారాన్ని అందిస్తుందని, ఖచ్చితమైన ఎత్తు, బరువు ఉండేలా చూడాలని, కేంద్రానికి వచ్చిన సరుకుల నిల్వల వివరాలు తక్షణం రిజిస్టర్‌లో నమోదు చేయాలని, ఆహార నిల్వలు సక్రమంగా ఉండాలని తెలిపారు. ఆదివారం జరిగే పోలియో చుక్కల కార్యక్రమం నిర్వహణలో మనవంతు భాగస్వామ్యాన్ని అందించాలని ఆమె సూచించారు. ఈ సమావేశంలో సూపర్‌వైజర్ సీహెచ్.పార్వతి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

విధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు : జడ్పీ చైర్‌పర్సన్



రికార్డులు తనిఖీ చేస్తున్న పద్మశ్రీ

పెదపాడు, మార్చి 2: ప్రజలకు అందుబాటులో ఉండేలా నిర్ణీత వేళల ప్రకారం గ్రామ సచివాలయ సిబ్బంది విధులకు సక్రమంగా హాజరు కావాలని, విధులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీ తెలిపారు. కొత్తూరు, పాతముప్పర్రు గ్రామాల్లో గ్రామ సచివాలయాలను జడ్పీ చైర్మన్ పద్మశ్రీ శనివారం తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు, సంక్షేమ పథకాల అమలు, కార్యాలయ నిర్వహణ తదితర అంశాలను పరిశీలించి, సిబ్బందికి సూచనలు చేశారు. కార్యక్రమంలో ఘంటా ప్రసాదరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పదో తరగతిలో అధిక మార్కులు సాధించాలి



భోజనాన్ని పరిశీలిస్తున్న సత్యనారాయణ

ఉంగుటూరు, మార్చి 2: పదో తరగతి పరీక్షలలో ఎక్కువ శాతం మార్కులు సాధించాలని ఫుడ్, విజిలెన్స్ కమిటీ జిల్లా కమిటీ సభ్యుడు కోనే సత్యనారాయణ అన్నారు. చేబ్రోలు బాలికల వసతి గృహంలో శుక్రవారం రాత్రి కెరీర్ గైడెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కోనే సత్యనారాయణ వసతి గృహాన్ని తనిఖీచేసి కెరీర్ గైడెన్స్ నిర్వహించారు. అనంతరం రాత్రి విద్యార్థుల భోజన సౌకర్యంపై ఆరా తీశారు. వసతిగృహ సంక్షేమ అధికారి మీరాబాయి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణారావు

ఏలూరు రూరల్, మార్చి 2: విద్యార్థులు కష్టపడి చదివితే భవిష్యత్ బంగారుమయమేనని లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు ఎస్‌వి. సుబ్రహ్మణ్యం అన్నారు. శనివారపుపేట జడ్పీ హైస్కూల్లో 10వ తరగతి విద్యార్థులకు క్లబ్ తరపున, ట్రేస్ ఇండియా ఆధ్వర్యంలో శనివారం పరీక్ష ప్యాడ్‌లు, క్యాంపస్ బాక్స్‌లు, పెన్నులు పంపిణీ చేశారు. వీజీఎం వీఆర్.కృష్ణారావు మాట్లాడుతూ విద్యార్థుల చదువుకోసం తల్లిదండ్రులు పడుతున్న కష్టాన్ని గుర్తు చేసుకోవాలన్నారు. అనంతరం ట్రేస్ ఇండియా అధ్యక్షుడు దిడ్లా యాంజిలో ప్రతిభగల విద్యార్థులకు నగదు పురస్కారాన్ని అందజేశారు. హెచ్‌ఎం జి.ప్రకాష్, రాజ్‌కుమార్, పీవీ.నరసింహారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

బుద్ధుని బోధనలు అనుసరణీయం



సంతోషరావును సత్కరిస్తున్న అధ్యాపకులు

కామవరపుకోట, మార్చి 2: బుద్ధుని బోధనలు అనుసరణీయమని చింతలపూడి ప్రభుత్వ డిగ్రీ కళాశాల చరిత్ర అధ్యాపకులు ఎం.సంతోషరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో శనివారం బుద్ధిజం అంశంపై అతిథి ఉపన్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సంతోషరావు బుద్ధుని బోధనలు, బౌద్ధమత చారిత్రక నేపథ్యం క్లుప్తంగా వివరించారు. ప్రిన్సిపాల్ ఎం.మల్లేశ్వరరావు, ఐక్యూఏసి కోఆర్డినేటర్ జి.శ్రీనివాసరావు, అధ్యాపకుడు వి.శ్రీనివాస్, ఎం.ఉషారాణి, కె.ఇందిరాకుమారి, దారావతు మల్లేష్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే ఎలీజా



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

లింగపాలెం, మార్చి 2: అన్నపనేనివారిగూడెంలో రోడ్డు నిర్మాణ పనులను ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా శనివారం ప్రారంభించారు. అన్నపనేనివారిగూడెం రోడ్డు పూర్తిగా ధ్వంసమై రాళ్ళు తేలిపోవడంతో ప్రయాణానికి ఇబ్బందిగా ఉందని, పలువురు గ్రామస్థుల ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై సర్పంచ్ రవీంద్ర ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్ళారు. ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో మాట్లాడి రోడ్డు మరమ్మతుల పై 76లక్షలు నిధులు విడుదల చేయించారు. శనివారం నాడు రోడ్డు నిర్మాణ పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు.

అర్హులందరికీ ఇళ్లు, పట్టాల మంజూరు

బుట్టాయగూడెం, మార్చి 2: నియోజకవర్గంలోని అర్హులందరికీ ఇళ్లు, పట్టాలను మంజూరు చేస్తామని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. స్థలాలు మంజూరైనవారికి రిజిస్ట్రేషన్లు చేసి పట్టాలు ఇచ్చామన్నారు. తాటుగూరగొమ్ము కాలనీలో 303 మంది గిరిజన లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ చేసిన ఇళ్ళ పట్టాలను శనివారం పంపిణీ చేశారు. అంతకుముందు పీఆర్.గూడెంలో రైతు భరోసా కేంద్ర భవనం, సీసీ రోడ్లను, దొరమామిడిలో గ్రామ సచివాలయం, ఆర్‌బీకెలను ఆయన ప్రారంభించారు. భవనాల నిర్మాణాలకు స్థలాన్ని ఇచ్చిన మద్దిపాటి నాగేశ్వరరావు కుమారుడు సత్యనారాయణను ఘనంగా సన్మానించారు. కండ్రికగూడెం నుంచి కన్నాపురం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. కొవ్వాడ గ్రామానికి చెందిన రామన్న నాగేశ్వరరావు సతీమణి సుజాత బ్రెయిన్ క్యాన్సర్‌తో బాధపడుతుండగా టీబీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.20 వేలు ఆర్థికసాయాన్ని కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో తెల్లం రాజ్యలక్ష్మి, జడ్పీటీసీ ఎం.రామతులసి, వైస్ ఎంపీపీ జి.మోహనరావు, కన్వీనర్ అల్లూరి రత్నాజి, ఆరేటి సత్యనారాయణ, సర్పంచ్‌లు తెల్లం రాముడు, బన్నె బుచ్చిరాజు, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఆర్‌ఐ గంగరాజు, డీటీ రమేష్ రెవెన్యూ సిబ్బంది, నాయకులు లబ్ధిదారులు పాల్గొన్నారు.



నీలాద్రిపురంలో మహిళా పథకాలు వివరిస్తున్న గన్ని



ఏలూరులో టీడీపీ మినీ మేనిఫెస్టో వివరిస్తున్న చంటి



బుట్టాయగూడెంలో మాట్లాడుతున్న బొరగం శ్రీనివాసులు



చింతలపూడిలో నాయీబ్రాహ్మణ నేతలతో రోషన్‌కుమార్

టీడీపీ-జనసేన కూటమితోనే అభివృద్ధి సాధ్యం

గ్రామాల్లో టీడీపీ మేనిఫెస్టో వివరించిన నేతలు

ఉంగుటూరు, మార్చి 2: తెలుగుదేశం, జనసేన కూటమి ప్రభుత్వం ఏర్పాటైతేనే అభివృద్ధి సాధ్యమని, కూటమి అభ్యర్థులకు గెలిపించాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు కోరారు. మండలంలోని నీలాద్రిపురంలో శనివారం మన ఇంటికి మన గన్ని కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట నియోజకవర్గ, మండల స్థాయి, గ్రామస్థాయి కార్యకర్తలు పాల్గొన్నారు.

● ఏలూరు టూటౌన్: ప్రజాస్పందన చూస్తుంటే రానున్న ఎన్నికల్లో వైసీపీ కనుమరుగు కావడం ఖయమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బడేటి చంటి అన్నారు. శాంతినగర్, వినాయకనగర్‌లో బడేటి చంటి ప్రజా సంకల్పయాత్రలో పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వైసీపీ పాలనలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అన్ని వర్గాల ప్రజలు వాపోతున్నారని చంటి తెలిపారు. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ప్రకటించిన సూపర్-6 పథకాలపై ప్రజలు ఆకర్షితులు అవుతున్నారన్నారు. రోజురోజుకు కూటమికి ఆదరణ పెరుగుతుందన్నారు. సొంత చెల్లెలుతోపాటు డాక్టర్ సునీత మా అన్నకు ఓటు వేయవద్దని కోరడం జగన్ ఎటువంటి వ్యక్తో అర్థమవుతుందన్నారు. అట్లూరి రామకృష్ణ, భాస్కరరావు, కిశోర్, శ్రీనివాస్, బాబురావు, బెనర్జి, రమేష్, పాల్గొన్నారు.

వైఎస్ సునీత న్యాయ పోరాటానికి మద్దతు

భీమడోలు, మార్చి 2 : వైఎస్ సునీత న్యాయపోరాటంలో ఆమెకు టీడీపీ అండగా ఉంటుందని జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు అన్నారు. గుండుగొలనులో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైఎస్ వివేకానందరెడ్డిని హత్యచేసిన వారికి శిక్ష పడాలని లేకపోతే రాష్ట్రంలోని పౌరులు మాన ప్రాణాలకు రక్షణ ఉండదన్నారు. సొంత చెల్లికే న్యాయం చేయలేని జగన్ ముఖ్యమంత్రిగా కొనసాగేందుకు అర్హత లేదని, ఆడబిడ్డకు న్యాయం చేయలేని సీఎం రాష్ట్రంలో ఉన్న అక్కా చెల్లెళ్లకు ఏమి న్యాయం చేస్తాడని ఆయన ఎద్దేవా చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు శిరిబత్తిన కొండబాబు గృహ ఆవరణలో సమావేశం జరిగింది. పలువురు పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● బుట్టాయగూడెం: రాజకీయ లబ్ధికోసమే వివేకానందరెడ్డిని హతమార్చారని టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాస్ అన్నారు. వివేకానందరెడ్డి హత్య కేసులో జగన్‌రెడ్డి పాత్రపై విచారణ జరగాలని కోరారు. వివేకానందరెడ్డి గొడ్డలిపోటుతో చనిపోయినట్లు జగన్‌రెడ్డి ఎలా చెప్పగలిగారని, సీబీఐ విచారణ ఎందుకు వద్దన్నారో రాష్ట్ర ప్రజలకు చెప్పాలన్నారు.

● జంగారెడ్డిగూడెం: బాబాయ్ వివేకానంద హత్యతో శవ రాజకీయాలు చేసిన జగన్మోహనరెడ్డికి ప్రజలు బుద్ధి చెప్పాలని నియోజకవర్గ అభ్యర్థి సొంగా రోషన్‌కుమార్ అన్నారు. ఆయన విలేకర్లతో మాట్లాడుతూ బాబాయ్ వివేకానంద హత్య కేసులో జగన్ పాత్రపై విచారణ జరపాలన్నారు. చెల్లెలికి న్యాయం చేయలేని జగన్ రాష్ట్రాన్ని ఉద్ధరిస్తారా అని ప్రశ్నించారు. సునీతమ్మ పోరాటంలో అర్థం ఉందన్నారు. తన కన్న తండ్రి ఎలా చనిపోయారో అనే విషయంపై ఇప్పటికీ కోర్టుల చుట్టూ తిరుగుతున్నారన్నారు. జగన్ అధికారాన్ని అడ్డం పెట్టుకుని హత్యరాజకీయం చేస్తున్నారన్నారు. జగన్ కుట్రలను ప్రజల అర్థం చేసుకోవాలన్నారు. ప్రజాస్వామ్యబద్ధమైన టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వాన్ని ప్రజలు ఎన్నుకోవాలన్నారు. మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళి, నాయకులు మండవ లక్ష్మణరావు, షేక్ ముస్తఫా, రావూరి కృష్ణ, పెనుమర్తి రామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

● పెదవేగి: వివేకానందరెడ్డి హత్య కేసులో సీఎం జగన్‌రెడ్డి పాత్రపై పూర్తిస్థాయి విచారణ జరగాలని మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ డిమాండ్ చేశారు. గొడ్డలి వేటుతోనే బాబాయ్ చనిపోయారని జగన్‌రెడ్డి అంత కచ్చితంగా చెప్పడం అనుమానాలకు తావిస్తుందన్నారు. తొలుత సీబీఐ విచారణ కోరిన జగన్, ఆపై ఎందుకు వద్దంటున్నాడని ప్రశ్నించారు. వివేక మృతి వెనుక జరిగిన సంఘటనలన్నీ జగన్‌రెడ్డికి తెలుసని, ఎందుకు దీనిని దాచాలనుకుంటున్నారు. తండ్రి హత్యకు న్యాయం చేయాలని కుమార్తె పోరాడుతుంటే, తమ్ముడిని సీబీఐ అరెస్టు చేయకుండా జగన్ ఎందుకు అడ్డుపడ్డారని, అవినాష్‌ను అరెస్టు చేయడానికి వెళ్తే కర్నూలులో ఉద్రిక్తత వాతావరణాన్ని సృష్టించింది వైసీపీ నేతలు కాదా అని ప్రశ్నించారు. వైసీపీ శవ రాజకీయాలు చేస్తోందని, ప్రజలే తగిన శిక్ష విధిస్తారన్నారు.

నాయీ బ్రాహ్మణుల సంక్షేమమే లక్ష్యం : రోషన్

చింతలపూడి: నాయీ బ్రాహ్మణుల సంక్షేమం టీడీపీ లక్ష్యమని సొంగా రోషన్‌కుమార్ అన్నారు. నాయీ బ్రాహ్మణ జిల్లా సంఘం నేతలు నియోజకవర్గంలో ప్రచారం నిమిత్తం తయారుచేసిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. నాయీ బ్రాహ్మణ సంఘం జిల్లా సాధికారత కన్వీనర్ కొప్పెర్ల నాగరాజు మాట్లాడుతూ జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో పోస్టర్లు విడుదల చేస్తామని చెప్పారు. గతంలో వృత్తికి సంబంధించిన పరికరాలు ఆదరణ పథకంలో ఇచ్చారని, వైసీపీ ప్రభుత్వంలో జగన్ చేసిన వాగ్దానాలు కూడా అమలు చేయలేదని, ఇది అందరికీ అసంతృప్తిగా ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలోనే నగరం కొండయ్య కుమార్తె చదువు నిమిత్తం ఐదు వేల రూపాయల సహాయాన్ని సొంగా రోషన్‌కుమార్ అందజేశారు. కార్యక్రమంలో నాయకులు నందిగం సుబ్బారావు, నరం సత్యనారాయణ, మల్లికార్జునరావు, మురళి, తదతరులు పాల్గొన్నారు.

ప్రతి పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించాలి : జేసీ

ఏలూరు సిటీ, మార్చి 2: రానున్న ఎన్నికల నేపథ్యంలో నియమించబడిన సెక్టార్ అధికారులు తమ పరిధిలోని ప్రతి పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి వసతులను, ప్రతికూల, అనుకూలతలను పరిశీలించాలని జేసీ బి.లావణ్యవేణి సూచించారు. కలెక్టరేట్‌లో శనివారం సెక్టార్ అధికారులు, సెక్టార్ పోలీస్ అధికారులు శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో సెక్టార్ అధికారుల భూమిక ఎంతో బాధ్యతాయుతంతో కూడినదన్నారు. తమ పరిధిలో సోషల్, కమ్యూనిటీ, పొలిటికల్, లా అండ్ ఆర్డర్ పరిస్థితులు పరిశీలించాలన్నారు. ఈవీఎంలను స్ట్రాంగ్ రూమ్‌లకు చేర్చేందుకు సెక్టార్ అధికారులు పూర్తి బాధ్యత వహించాలన్నారు. డీఆర్వో పుష్పమణి మాట్లాడుతూ ఎన్నికల్లో సెక్టార్ అధికారులు ఇచ్చే సమాచారం ప్రధానమన్నారు. పోలవరం రిటర్నింగ్ అధికారి, ఐటీడీఏ పీవో ఎం.సూర్యతేజ మాట్లాడుతూ సెక్టార్ అధికారులకు నిర్దేశించిన ఎన్నికల విధులు వివరించారు. మాస్టర్ ట్రైనీ చక్రపాణి పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులైన ఆర్డీవోలు, ఎన్‌ఎస్ ఖాజావలి, వై.భవాని శంకరీ, కె.అద్దయ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ కార్డులు 83శాతం పంపిణీ : కలెక్టర్

ఏలూరు, కలెక్టరేట్, మార్చి 2: జిల్లాలో ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ 83 శాతం పంపిణీ పూర్తి చేసినట్లు కలెక్టర్ వై.ప్రసన్న వెంకటేశ్ తెలిపారు. విజయవాడ సీఎస్ క్యాంపు కార్యాలయం నుంచి శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్.జవహర్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. స్థానిక ఏలూరు కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ వై.ప్రసన్న వెంకటేష్, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాకు 5,05,458 ఆరోగ్యశ్రీ కార్డులు జారీ కాగా ఈకేవైసీ ద్వారా 4,19,964 కార్డులు పంపిణీ చేశామన్నారు. ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్స్ ప్రక్రియ 90శాతం జరిగిందన్నారు. జిల్లా వ్యవసాయశాఖ అధికారి షేక్ హబీబ్‌బాషా, డీపీవో టి.శ్రీనివాస విశ్వనాథ్, జిల్లా వైద్యాధికారి ఎస్.శర్మిష్ట, ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ రాజీవ్, పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఇగ్నో కోర్సుల్లో ప్రవేశాలకు తుదిగడువు 10

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 2: ఇందిరాగాంధీ సార్వత్రిక విశ్వ విద్యాలయం(ఇగ్నో)లో డిగ్రీ, పీజీ కోర్సులు, వివిధ డిప్లమో, సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు గడువును ఈ నెల 10 వరకు పొడిగించినట్లు ఇగ్నో స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు శనివారం తెలిపారు. అడ్మిషన్లు, కోర్సులపై అవగాహన కార్యక్రమాన్ని ఈ నెల 5న సీఆర్‌ఆర్ కళాశాలలో ఇగ్నో డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ కృష్ణారావు నిర్వహిస్తారన్నారు.

క్లస్టర్ విధానం రద్దు చేయాలి

ఏలూరు టూటౌన్, మార్చి 2: పశుసంవర్థక శాఖలో క్లస్టర్ విధానం రద్దు చేయాలని ఏపీ జూనియర్ వెటర్నరి ఆఫీసర్స్ అండ్ లైఫ్ స్టార్ట్ ఆఫీసర్స్ అండ్ సర్వీస్ అసోసియేషన్ అధ్యక్షులు సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ విధానం వలన పారా వెటర్నరి సిబ్బంది ఇబ్బందులుపడుతున్నారని అన్నారు. గ్రామీణ పశువైద్య శాలల స్థానంలో క్లస్టర్ విధానం అమలు చేయడం వలన ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. 30 ఏళ్ల అనుభవం ఉన్న సిబ్బందికి సచివాలయ, పశువైద్య సహాయకులకు తేడా లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

రైల్వే స్టేషన్ అభివృద్ధి చేయాలి

ఏలూరు క్రైం, మార్చి 2 : ఏలూరులో రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేయాలని ఏలూరునకు చెందిన కేవీఎస్‌పి శర్మ విజయవాడ డివిజినల్ రైల్వే మేనేజర్‌కు వినతిపత్రాన్ని పంపించారు. ఏలూరు పెద్ద రైల్వే స్టేషన్‌లో ఫుట్ ఓవర్ బ్రిడ్జిని గూడ్స్ షెడ్డు రోడ్డువైపు పొడిగించాలని, అంతేకాకుండా లిఫ్టు సదుపాయం కూడా కల్పించాలని, 2,3 ప్లాట్‌ఫారమ్‌లపై మరుగుదొడ్లను, టాయిలెట్స్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. ఏలూరు పవర్‌పేట రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫారమ్‌ను అభివృద్ధి చేసి రెండు అడుగులు ఎత్తు పెంచి అభివృద్ధి చేయాలన్నారు. తెల్లవారుజామున వచ్చే రైళ్ళల్లో రైల్వే స్టేషన్ తెలియజేసేలా స్పీకర్లను ఏర్పాటు చేయాలని శర్మ ఈ మేరకు కోరారు.

16న జాతీయ లోక్ అదాలత్

చింతలపూడి, మార్చి 2: జాతీయ లోక్ అదాలత్ ఈనెల 9న జరగాల్సి ఉందని, 16వ తేదీకి మార్చినట్టు జూనియర్ సివిల్ జడ్జి సి.మధుబాబు తెలిపారు. 16న జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో రాజీపడతగ్గ క్రిమినల్, చెక్‌బౌన్స్ కేసులు, బ్యాంకు బకాయిలు, మనోవర్తి, గృహహింస కేసులు, భూమి తగాదా, ప్రాంసరీనోట్లు రాజీపడతగ్గవి రాజీ చేసుకోవచ్చని తెలిపారు. అదేవిధంగా ప్రీలిటిగేషన్ కేసులుగా బ్యాంకు బకాయిలు, టెలిఫోన్ బకాయిలు రాజీ చేసుకోవాలన్నారు. రాజీ వలన సొమ్ము, సమయం ఆదా అవుతుందని, రాజీయే రాజమార్గమని తెలిపారు. లోక్ అదాలత్ మార్పు జరిగిన తేదీని ఇతరులకు తెలియచేయాలని కక్షిదారులకు, పారా లీగల్ వలంటీర్లకు అవగాహన కల్పించారు.

బీజేపీ నేతల నిరసన ప్రదర్శన



ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నేతలు

ఏలూరు టూటౌన్, మార్చి 2: పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జి పాలనలో మహిళలపై దౌర్జన్యాలు, దాడులు, అత్యాచారాలకు అంతే లేదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రమ్ కిషోర్ అన్నారు. బీజేపీ జిల్లా కార్యాలయం వద్ద మమత బెనర్జీకి వ్యతిరేకంగా బీజేపీ శ్రేణులు నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. విక్రమ్‌కిషోర్ మాట్లాడుతూ మమత బెనర్జీ అనుచరుడు షాజహాన్ చేస్తున్న ఆరచకాలను ఖండిస్తున్నామని షాజహాన్‌ను వెంటనే అరెస్టు చేయాలన్నారు. అతనిపై 43 క్రిమినల్ కేసులు ఉన్నాయని అన్నారు. కార్యక్రమంలో గాది రాంబాబు, కృష్ణ, ఎం.కృష్ణకుమారి, మత్తేశాస్త్రి, రామ్‌ప్రసాద్, నాగం శివ, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

రామచంద్ర కళాశాలలో ఘనంగా టెక్ ఫెస్ట్



అలరించిన నృత్య ప్రదర్శన

పెదపాడు, మార్చి 2: నేటి సాంకేతిక యుగంలో నూతన ఆవిష్కరణలతో గుర్తింపు పొందాలని వట్లూరు రామచంద్ర ఇంజనీరింగ్ కళాశాల ఎండీ కె.సాయిరోహిత్ అన్నారు. రామచంద్ర కళాశాలలో రెండు రోజుల టెక్ ఫెస్ట్ (క్రేయా- 2024) వేడుకలు శనివారం ముగిశాయి. సాంకేతిక అంశాల ప్రదర్శనతో పాటుగా సాంస్కృతిక, వినోద ప్రదర్శనలతో విద్యార్థులు అలరించారు. థియరీ బ్యాండ్ (యానిమల్ మూవీ) సభ్యులు హుషారెత్తించే పాటలతో, ఇంజనీరింగ్ విద్యార్థినుల సంప్రదాయ నృత్యాలతో సందడి వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు కె.శ్రీనివాసరావు, వివిధ విభాగాల హెచ్‌వోడీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ అందించేందుకు చర్యలు

పెదపాడు, మార్చి 2: గ్రామాల్లో నాణ్యమైన విద్యుత్ అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ వై.రాంబాబు తెలిపారు. రాజుపేటలో ఏర్పాటు చేసిన 63 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను శనివారం అందుబాటులోకి తీసుకువచ్చారు. వేసవిలో లోఓల్టేజీ సమస్యలను గుర్తించడంతో పాటుగా ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టామన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లో రాగి వైరు చోరీ

జంగారెడ్డిగూడెం, మార్చి 2: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలో రాగివైరు చోరీపై జంగారెడ్డిగూడెం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. వేగవరం, రామచర్లగూడెం గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్లలో రాగి వైరును గత నెల 26న గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. ఏఈ శ్రీనివాసులు ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు.



వర్క్‌షాపులో మాట్లాడుతున్న వీసీ విజయకుమార్

డ్రోన్ టెక్నాలజీతో విప్లవాత్మక మార్పులు

నూజివీడు, మార్చి 2: డ్రోన్ టెక్నాలజీ నేటి ఆధునిక యుగంలో అన్ని రంగాల్లోనూ ప్రధాన భూమికి పోషిస్తోందని, రాజీవ్‌గాంధీ యూనివర్శిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఎస్.విజయ్‌కుమార్ అన్నారు. నూజి వీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో డ్రోన్ టెక్నాలజీపై వర్క్‌షాప్‌ను నిర్వహించారు. టి.ఐ.హెచ్.ఎ.ఎన్ (టెక్నాలజీ ఇన్నోవేషన్ హబ్ ఆన్ అటానమస్ నేవిగేషన్)ఐఐటీ హైదరాబాద్ సహకారంతో డ్రోన్ టెక్నాలజీ, డిజైన్ టెక్నాలజీ, ఇతర నైపుణ్యాల పై శిక్షణ ఇచ్చేందుకు ఈ వర్క్‌షాపును ప్రారంభించారు. జ్యోతి ప్రజ్వలనచేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన వీసీ విజయ్‌కుమార్ మాట్లాడుతూ వైద్యరంగం, వ్యవసాయం, విపత్తుల నిర్వహణ, రవాణా తదితర రంగాల్లో డ్రోన్ టెక్నాలజీని ఉపయోగించుకోవాలన్నారు. విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దేందుకు ఇలాంటి వర్క్‌షాపులు ఎంతో అవసరమ న్నారు. వర్క్‌షాప్ సమన్వయకర్తలు, డాక్టర్ రియాజ్ హుస్సేన్, జి.భానుకిరణ్, నూజివీడు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ డైరెక్టర్లు చంద్రశేఖర్, బాలాజి తదితరులు పాల్గొన్నారు.



చేబ్రోలులో పీహెచ్‌సీ సిబ్బంది, విద్యార్థుల ర్యాలీ



కె.గోకవరం పీహెచ్‌సీ సిబ్బంది అవగాహనా ర్యాలీ

పల్స్ పోలియో విజయవంతం చేయాలి

లింగపాలెం, మార్చి 2: పల్స్ పోలియో శిబిరాల్లో ఐదేళ్లలోపు చిన్నారులకు ఓలియో చుక్కలు వేయించాలని కెగోకవరం వైద్యాధికారి ఎమ్మీ అబీదా కోరారు. కె.గోకవరం పీహెచ్‌సీలో శనివారం సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం నిర్వహించే శిబిరాల్లో పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలన్నారు. వైద్య సిబ్బంది గ్రామాల్లో ఐదేళ్ల లోపు పిల్లలను గుర్తించి పోలియో చుక్కలు వేయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్వచ్ఛంద సంస్థలు, సేవాభావంతో ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలన్నారు. అనంతరం అవగాహన ర్యాలీలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

● ఉంగుటూరు: పోలియో రహిత సమాజం కోసం కృషి చేయాలని చేబ్రోలు వీధులలో పీహెచ్‌సీ సిబ్బంది అవగాహనా ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారులు వర్మ, శ్రావణ్‌రెడ్డి పాల్గొన్నారు. 34 పల్స్ పోలియో బూత్‌లను ఏర్పాటు చేశామని, 2355 మంది పిల్లలను గుర్తించామని వివరించారు.

● కొయ్యలగూడెం: పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని బయ్యన్నగూడెం పీహెచ్‌సీ డాక్టర్ సత్యనారాయణ కోరారు. బయ్యన్నగూడెంలో వైద్య సిబ్బంది, గ్రామస్తులతో ర్యాలీ నిర్వహించారు. అన్ని గ్రామాల్లో పోలియో చుక్కలు వేస్తారని, ప్రతీ ఒక్కరు తమ పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలన్నారు. ప్రధాన సెంటర్‌లో భారీ ర్యాలీ నిర్వహించారు. విస్తరణాధికారి సుబ్రహ్మణ్యం, సిబ్బంది మేరీగోల్డ్, చాన్‌భాష, మరియమ్మ పాల్గొన్నారు.

మహా శివరాత్రి ఉత్సవాలకు సన్నాహాలు

ఏలూరు కార్పొరేషన్, మార్చి 2: నగరంలోని శివాలయాల్లో శివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు చేశారు. పత్తేబాద చౌడేశ్వరి రామలింగేశ్వరస్వామి ఆలయం, సత్యనారాయణపేట గంగా పార్వతీ సమేత రేవు లింగేశ్వరస్వామి, అగ్రహారం నగరేశ్వరస్వామి, పాత శివాలయం, దక్షిణపువీధి మార్కండేయ స్వామి, జరాపహరేశ్వరస్వామి, పవరుపేట కాశీ విశ్వేశ్వరాలయం, బావిశెట్టి వారిపేట కాశీ విశ్వేశ్వరాలయం, నాగేశ్వరపురం శివాలయాల వద్ద ఈనెల 5 నుంచి ఉత్సవాలు నిర్వహించనున్నారు. 8న మహాశివరాత్రి సందర్భంగా స్వామివారికి ఏకవీర రుద్రాభిషేకం, ఉత్సవ విగ్రహాల ఊరేగింపు, శాంతి కల్యాణం, లింగోద్భావ కాలంలో ఏకాదశ రుద్రాభిషేకానికి ఏర్పాట్లు చేశారు.

కైకరం ప్రశాంత నిలయంలో పూజలు

ఉంగుటూరు, మార్చి 2: కైకరం చిద్వేంకట రామబ్రహ్మానంద మహర్షి ప్రశాంత నిలయంలో శనివారం నుంచి వార్షిక సప్తాహ మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. శివరామ వెంకట సుబ్బారావు దంపతులు కలశ స్థాపన చేశారు. ఉదయం సీతారామ గీతార్చన సత్సంగం భజన, సాయంత్రం ఆధ్యాత్మికవేత్త జటావల్లభుల రామమూర్తి ఉపన్యాసం చేశారు.

పారిజాతగిరి వెంకన్నకు విశేష పూజలు



జంగారెడ్డిగూడెం, మార్చి 2: గోకుల తిరుమల పారిజాతగిరి వేంకటేశ్వరస్వామిని శనివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. వేకువజామున 5 గంటలకు సుప్రభాత సేవతో పూజా కార్యక్రమాలు ప్రారంభించి భక్తులకు దర్శనం కల్పించారు. స్వామి వారికి హారతి, అష్టోత్తర పూజలను ఆలయ ప్రధాన అర్చకులు నల్లూరు రవికుమార్ ఆచార్యులు నిర్వహించారు. నూతన వధూవరులు, పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులకు దాతల సహకారంతో అన్న ప్రసాద వితరణ జరిపించారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు అబ్బిన దత్తాత్రేయ, రెడ్డి రంగ ప్రసాదరావు, వాసవి సాయి నగేష్, వికాస తరంగిణి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రామకోటిలో కొనసాగుతున్న ఉత్సవాలు

ఏలూరు కార్పొరేషన్, మార్చి 2: అగ్రహారంలోని రామకోటి ప్రాంగణంలో జరుగుతున్న రామకోటి మహోత్సవాల్లో భాగంగా శనివారం సీతారామాంజనేయ భక్త సమాజం వారు సుందరాకాండ పారాయణను సామూహికంగా పఠించారు. రాధాజోస్యుల సీతమ్మవారి దివ్య చరితామృతాన్ని పఠించారు. కళాకారులు కూచిపూడి నృత్యాలను ప్రదర్శించారు. వంగల శ్రావణి శిష్య బృందం భరతనాట్యాలను ప్రదర్శించారు. ఉత్సవ కమిటీ కార్యవర్గ సభ్యులు కొట్టు మధు వెంకట్రావు, గాదంశెట్టి రమేష్‌కుమార్, వి.సురేష్‌కుమార్, మానేపల్లి రామారావు, పాదర్తి బాలకృష్ణ భక్తులకు తగు ఏర్పాట్లు చేశారు.

6న సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు

ఏలూరు కార్పొరేషన్, మార్చి 2: అగ్రహారంలోని రామకోటి ప్రాంగణంలో ఈనెల 6న మాఘ బహుళ ఏకాదశి సందర్భంగా సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహిస్తున్నట్టు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

కోలాట బృందానికి తపనా ఫౌండేషన్ సహాయం

చింతలపూడి, మార్చి 2: అంతరించిపోతున్న జానపద కళలను ప్రోత్సహిస్తూ తపనా ఫౌండేషన్ ద్వారా ఆర్థిక సహకారం అందిస్తున్నారని రేచర్ల కోలాటం శిక్షణ గురువు సిరికొండ సుబ్బారావు అన్నారు. చింతలపూడి మండలం ఎ.కొత్తగూడెం గ్రామానికి చెందిన సీతారామలక్ష్మణ దాసాంజనేయ కోలాట బృందానికి రూ.28 వేల ఆర్థిక సహాయాన్ని ఫౌండేషన్ వ్యవస్థాపకులు గారపాటి సీతారామాంజనేయచౌదరి అందజేశారు. సుబ్బారావు మాట్లాడుతూ ఈ నిధులు ద్వారా కోలాట సభ్యులకు దుస్తులు, గజ్జలు వంటికి కొనుగోలు చేసుకుంటారని చెప్పారు. మట్టా సత్యభామ, చీకటి నాగేశ్వరరావు, మౌనిక, లక్ష్మీ, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

రహదారుల అభివృద్ధికి చర్యలు

పెదపాడు, మార్చి 2: నాయుడుగూడెంలో ఎస్సీ ఏరియాలో సీసీ రహదారులతో పాటుగా డ్రెయినేజీ ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి తెలిపారు. జడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీ, సొసైటీ అధ్యక్షుడు అక్కినేని రాజశేఖర్‌లతో కలిసి సీసీ రహదారులను శనివారం ప్రారంభించారు. ఎమ్మెల్యే కొఠారు మాట్లాడుతూ గ్రామాలను పూర్తిస్థాయిలో అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. అక్కినేని రాజశేఖర్, సర్పంచి సిద్దాబత్తిన జోజమ్మ, ఎంపీటీసీ కృపామణి, కొత్తూరి విమలరావు తదితరులు పాల్గొన్నారు.

చేబ్రోలు సొసైటీ బడ్జెట్ సమావేశం

ఉంగుటూరు, మార్చి 2: చేబ్రోలు సొసైటీ (నారాయణపురం) బడ్జెట్ సమావేశం శనివారం నిర్వహించారు. త్రి సభ్య కమిటీ చైర్మన్ యెలిశెట్టి పాపారావు బాబ్జి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో రానున్న ఆర్థిక సంవత్సరంలో తీసుకోవాల్సిన నిర్ణయాలు ఆదాయ వనరుల సమీకరణపై నిర్ణయం తీసుకున్నారు. సొసైటీ కార్యదర్శి యర్రా శ్రీను పాలకవర్గ సభ్యులకు బడ్జెట్ వివరించారు. గతంలో కంటే పెద్దఎత్తున ఖాతాదారుల సేవలను కొనసాగించాలని నిర్ణయం తీసుకున్నారు. సమావేశంలో త్రిసభ్య కమిటీ సభ్యులు దాసరి సత్యనారాయణ, నూరే ఏడుకొండలు రైతులు పాల్గొన్నారు.

నిరుపేదలకు మానవత చేయూత

భీమడోలు, మార్చి 2: ఎంఎంపురంలో నిరుపేద కుటుంబాలకు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ నిత్యావసర సరుకులు, కొత్త దుస్తులు అందజేశారు. గ్రామంలో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వృద్ధులు మద్దాల దుర్గ, సీతామహాలక్ష్మి, బొమ్మిడి సత్యవతి, సంకు సుబ్బలక్ష్మి కుటుంబాలకు సాయం అందజేశారు. కార్యక్రమంలో మానవత ప్రతినిధులు పాల్గొన్నారు.

కాపు జేఏసీ నియోజకవర్గ అధ్యక్షుడిగా మధు

కొయ్యలగూడెం, మార్చి 2: ఏపీ కాపు జేఏసీ పోలవరం నియోజకవర్గ అధ్యక్షుడిగా సంకు మధు నియమితులయ్యారు. రాష్ట్ర చైర్మన్ శ్రీనివాస్ నాయుడు నియామక ఉత్తర్వులు ఇచ్చినట్లు మధు తెలిపారు. కాపు సంఘాలన్ని ఏకమై కాపుల ఉన్నతికి కృషి చేస్తారని తెలిపారు.

రేపు సీపీఐ జిల్లా సమావేశం

కామవరపుకోట, మార్చి 2: సీపీఐ జిల్లా సమావేశాన్ని సోమవారం బుట్టాయిగూడెంలో నిర్వహిస్తున్నట్టు టీవీఎస్.రాజు తెలిపారు. సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ, జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డేగా ప్రభాకర్ పాల్గొంటారన్నారు.

కదలని పనులు..

- బిల్లుల చెల్లింపులో జాప్యం..
- ముందుకు రాని కాంట్రాక్టర్లు
- గ్రామాల్లో అసంపూర్తిగా ప్రభుత్వ భవన నిర్మాణాలు



గోపవరంలో సచివాలయ భవనం

ముసునూరు, మార్చి 2: ప్రజల వద్దకే పాలన పేరుతో ప్రభుత్వం గ్రామాల్లో నూతన భవనాలను నిర్మాణాలకు శ్రీకారం చుట్టి, సొంత పార్టీ నాయకులకే అప్పగించి ఐదేళ్ళు పూర్తికావస్తున్నా భవనాల నిర్మాణాలు పూర్తికాలేదు. పలు గ్రామాల్లో భవనాలు అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. డిజిటల్ లైబ్రరీ భవనాల ఊసేలేదు. హెల్త్ క్లినిక్ భవనాల పరిస్థితీ అంతే. సకాలంలో బిల్లులు రాకపోడంతోనే నిర్మాణాలు ఆగిపోయినట్లు తెలుస్తోంది. మండల వ్యాప్తంగా 16 డిజిటల్ లైబ్రరీ భవనాలు నిర్మించాల్సి ఉండగా ఒక్క లోపూడిలో మాత్రమే వినియోగంలోకి రాగా మిగిలిన 15 గ్రామాల్లో నేటికీ భూమిని కూడా కేటాయించలేదు. అలాగే 13 హెల్త్ క్లినిక్ భవనాలకు గాను రెండు పూర్తికాగా మిగిలిన 11 భవనాలు పునాది దశలోనే ఉన్నాయి. 8 అమూల్ పాల కేంద్రాల భవనాలకు గాను ఒక్కటి మాత్రమే వినియోగంలోకి రాగా మిగిలిన 7 భవనాల నిర్మాణాలకు నేటికీ శంకుస్థాపనలు జరగలేదు. అదేవిధంగా 16 రైతు భరోసా కేంద్రాల భవనాలకు గాను ఐదు భవనాలు వివిధ దశల్లో ఉన్నాయి. 16 సచివాలయాలకు గాను 13 వినియోగంలోకి రాగా మూడు భవనాలు మాత్రం స్లాబ్‌లు వేసి వదిలివేశారు. వేల్పుచర్ల గ్రామంలో ఐదు ప్రభుత్వ భవనాల్లో ఒక్క భవనం కూడా పూర్తికాలేదు. ఇంకా కోటి రూపాయల వరకు పెండింగ్ బిల్లులు ఉన్నట్లు కాంట్రాక్టర్‌లు చెబుతున్నారు. చేసిన పనులకు దశల వారిగా బిల్లుల చెల్లింపుల్లో తీవ్ర జాప్యం జరగడం వల్లే భవనాల నిర్మాణాలు ముందుకు సాగడం లేదనే విమర్శలున్నాయి. దీనికి తోడు ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో అప్పులు చేసి భవనాలను పూర్తిచేసినా, బిల్లులు వస్తాయో లేదో అని కాంట్రాక్టర్‌లు భవన నిర్మాణ పనులు చేపట్టేందుకు ముందుకు రావడం లేదని తెలుస్తోంది. ప్రభుత్వ పనితీరు వల్ల గ్రామాల్లో భవనాల పరిస్థితి ఇలా ఉందని, ఐదేళ్ళలో కూడా పూర్తిచేయలేకపోతే ఎందుకు భవనాల నిర్మాణాలను ప్రారంభించారని మండల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా వివిధ దశల్లో ఉన్న భవనాలను పూర్తి చేసేలా జిల్లా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



చింతలపల్లిలో పునాది దశలో హెల్త్‌క్లినిక్ భవనం



ముసునూరులో స్లాబ్ వేసి వదిలేసిన ఆర్బీకే భవనం

పనులు పూర్తయ్యేలా చర్యలు...

మండలంలో పలు గ్రామాల్లోని ప్రభుత్వ భవన నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం. బిల్లులు సకాలంలో రాకపోడవం వల్లే పనుల్లో జాప్యం జరుగుతోంది. ఇంకా రూ. 80 లక్షలు పైగా బిల్లులు రావాల్సిఉంది. కాంట్రాక్టర్లతో మాట్లాడి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం.

- రేగళ్ల దుర్గాప్రసాద్, పంచాయితీరాజ్ ఏఈ, ముసునూరు మండలం

మీటర్లు వద్దంటే.. కరెంట్ కట్

- ట్రాన్స్‌కో సిబ్బంది బెదిరింపు
- రైతులు వద్దంటున్నా వ్యవసాయ బోర్లకు స్మార్ట్‌మీటర్ల బిగింపు



రమణక్కపేటలో బిగించిన స్మార్ట్ మీటర్

ముసునూరు, మార్చి 2: ముసునూరు మండలం రమణక్కపేట గ్రామంలో వ్యవసాయ బోర్లకు స్మార్ట్ మీటర్లు బిగించే ప్రక్రియను శనివారం చేపట్టారు. మీటర్లను బిగించవద్దని రైతులు వ్యతిరేకిస్తున్నా ట్రాన్స్‌కో సిబ్బంది మాత్రం మీ బోరుకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామని బెదిరిస్తూ, మీటర్లను బిగిస్తున్నారని రైతులు చెబుతున్నారు. కేంద్ర ప్రభుత్వ పథకం అంటూనే మీటర్లపై జగన్‌రెడ్డి బొమ్మ ఉండటం విశేషం. ఉచిత విద్యుత్‌కు మంగళం పాడేందుకు వైసీపీ ప్రభుత్వం, కేంద్రంతో చేతులు కలిపి తమను ఇబ్బందులకు గురి చేసేందుకు యత్నిస్తోందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తే, సీఎం జగన్ ప్రభుత్వం మాత్రం మీటర్లను బిగిస్తామని చెప్పి కేంద్రం వద్ద రూ. 3500 కోట్లు తీసుకున్నాడని, భవిష్యత్‌లో కరెంట్ బిల్లులు కట్టి పంటలు పండించుకునే పరిస్థితి నెలకొంటుందని రైతులు ఆరోపిస్తున్నారు. గ్యాస్ సబ్సిడీని ఏ విధంగా దశల వారిగా ఎత్తివేశారో, అదే విధంగా ముందు స్మార్ట్ మీటర్ల ద్వారా వచ్చిన కరెంట్ బిల్లులను రైతులు చెల్లిస్తే, తిరిగి రైతుల ఖాతాల్లో ప్రభుత్వం వేసి, దశల వారిగా ఈ సబ్సిడీ నగదును సైతం ఎత్తివేసి, పూర్తిస్థాయిలో రైతుల నుంచి కరెంట్ బిల్లులు కట్టించుకునేలా ఈ ప్రభుత్వాల కుట్ర అని వామపక్ష, రైతు సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు.



పాలకొల్లు 2వ వార్డులో, వెలివెల గ్రామంలో పింఛన్ సొమ్ము అందజేస్తున్న వైసీపీ నాయకులు

వైసీపీ నేతల చేతుల్లో పింఛన్ల సొమ్ము

- వలంటీర్లను తప్పించి పంపిణీ

పాలకొల్లు, మార్చి 2 : ఇంటింటా పంపిణీ చేయాల్సిన పింఛన్ల ప్రజాధనం వైసీపీ నేతల చేతుల్లోకి చేరింది. మార్చి నెల పింఛన్ సొమ్ములు వారే వీధి వీధి తిరుగుతూ బాహాటంగా లబ్ధిదారులకు అందించి తమ పార్టీకి అను కూల ప్రచారాన్ని చేపట్టారు. పాలకొల్లులో జరిగిన ఈ ఘటనతో అందరూ అవాక్కయ్యారు. దీని వెనుక మున్సిపల్, మండల పరిషత్, గ్రామ సచివాలయ అధికా రులతో పాటు వాలంటీర్ల పాత్ర ఉందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. నియోజకవర్గ పరిధిలో పాలకొల్లు పట్టణం, పాలకొల్లు, యలమంచిలి, పోడూరు మండలాల్లో నిన్న పలుచోట్ల వైసీపీ కార్యకర్తలే పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని బాహాటంగా చేపట్టారు. పట్టణంలోని 1, 2, 6, 10, 17, 23వ వార్డుల్లో అలాగే మండలాల్లోని ఆయాగ్రామాల్లో వైసీపీ నాయకులే ఇంటింటికీ వెళ్లి పింఛన్ సొమ్ము అందించారు. ఈపింఛన్ సొమ్ములు పంపిణీ చేసిన కొందరు వైసీపీ నాయకులు, కార్యకర్తలు అయితే బాహాటంగా వచ్చే ఎన్నికల్లో వైసీపీకి ఓట్లు వేసి గెలిపించాలని కోరుతూ పింఛన్ సొమ్ము చేతిలో పెట్టిన వైనం కనిపించింది. అసలు ఈప్రభుత్వ ప్రజాధనం ముందుగా వైసీపీ నేతల చేతుల్లోకి ఎలా వెళ్లిందనే ఆశ్చర్యం కలిగిస్తుంది. మరో వైపు కొన్నిచోట్ల వాలంటీర్లు ప్రేక్షకపాత్ర వహిస్తూ వైసీపీ నేతల చేతుల మీదుగా పింఛన్ సొమ్ములు పంపిణీ చేయించిన సంఘటనలు చోటు చేసుకున్నాయి.



రైతులతో మాట్లాడుతున్న కొలుసు పార్థసారథి

రైతులకు పరిహారం చెల్లించండి

- అధికారులను కోరిన పార్థసారథి

నూజివీడు, మార్చి 2: మల్లవల్లి నిర్వాసిత భూముల సమస్యలను నూజివీడు జనసేన-టీడీపీ ఉమ్మడి అభ్యర్థి కొలుసు పార్థసారథి దృష్టికి తీసుకువెళ్ళగా ఆయన కృష్ణా జిల్లా కలెక్టర్‌కు, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్‌లతో మాట్లాడి, రైతులకు న్యాయం చేయాలని సూచించినట్లు ఉమ్మడి కృష్ణాజిల్లా జనసేన అధికార ప్రతినిధి మరీదు శివరామకృష్ణ తెలిపారు. కృష్ణాజిల్లా పరిధిలో ఉన్న మల్లవల్లి ఇండస్ట్రియల్ కారిడార్‌లో నూజివీడు మండలం మీర్జాపురం, మర్రి బంధంతో పాటు బాపులపాడు మండలానికి చెందిన పలువురు రైతులు తమ భూములను కోల్పోయారని, అయితే వారికి నేటికీ పరిహారం చెల్లించక పోవ డంతో జనసేన ఆధ్వర్యంలో రైతుల పక్షాన మూడురోజుల పాటు పోరాటం చేసిన విషయాన్ని పార్థసారథికి తెలిపామన్నారు. ఈ నేపథ్యంలో బాధిత రైతులతో సమావేశమైన పార్థసారథి రైతులతో చర్చించిన అనంతరం కృష్ణా జిల్లా కలెక్టర్, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్‌తో మాట్లాడి, తక్షణం రైతులకు నష్టప రిహారం అందేలా చర్యలు చేపట్టాలని సూచించారన్నారు. నూజివీడు మండల జనసేన అధ్యక్షుడు యర్రంశెట్టి రాము, నాయకులు ఎం.సునీల్‌కుమార్, కోటి, వీర మహిళలు రంగు ధనలక్ష్మి, వేణు, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.



కైకలూరులో సూపర్ 6 పథకాల క్యాలెండర్ పంపిణీ

టీడీపీ-జనసేనతోనే అన్ని వర్గాలకు మేలు

- కైకలూరులో బాబు ష్యూరిటీ.. భవిష్యత్‌కు గ్యారెంటీ

కైకలూరు, మార్చి 2: అన్ని సామాజిక వర్గాల ప్రజలు ఆర్థికంగా బలపడా లంటే టీడీపీ-జనసేన ప్రభుత్వం రావాలని టీడీపీ నాయకుడు పెన్మెత్స వెంకటేశ్వరరాజు అన్నారు. శనివారం కైకలూరు పట్టణంలో 126వ బూత్ పరిధిలో టీడీపీ-జనసేన ప్రవేశపెట్టిన సూపర్ 6 పథకాల క్యాలెండర్‌ను ఇంటింటికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టీడీపీ నేతలు మాట్లాడుతూ సూపర్ 6 పథకాలతో ప్రజలు ఎంతో లబ్ధి పొందుతారన్నారు. ప్రతి ఇంటికి ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు, ప్రతి మహిళకు నెలకు రూ.1500లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.3 వేలు నిరుద్యోగ భృతి, ఒక ఇంటిలో ఎంతమంది విద్యార్థులు స్కూల్‌కు వెళితే అంతమందికి ఒక్కొక్కరికి రూ.15 వేలు తమ ప్రభుత్వం అందిస్తుందన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేనను గెలిపిం చాలని కోరారు. జడ్పీటీసీ మాజీ సభ్యులు బొమ్మనబోయిన విజయలక్ష్మి, మాజీ ఎంపీపీ వీరమల్లు నరసింహారావు, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు కేకే బాబు, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి పోలవరపు లక్ష్మీరాణి, తెలుగు మహిళా అధ్యక్షురాలు తెంటు వెంకట రమణ, పార్టీ పట్టణ ఉపాధ్యక్షుడు పడమటి వాసు, ఎస్సీ సెల్ నాయకులు వీరాబత్తిన సుధా తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్ టెక్నాలజీతో విప్లవాత్మక మార్పులు



వర్క్‌షాపును ఉద్దేశించి మాట్లాడుతున్న వీసీ

నూజివీడు, మార్చి 2: డ్రోన్ టెక్నాలజీ నేటి ఆధునిక యుగంలో అన్ని రంగా ల్లోనూ ప్రధాన భూమికి పోషిస్తోందని, రాజీవ్‌గాంధీ యూనివర్శిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఎస్.విజయ్‌కుమార్ అన్నారు. నూజి వీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో డ్రోన్ టెక్నాలజీ పై వర్క్‌షాప్‌ను నిర్వహించారు. టి.ఐ.హెచ్.ఏ.ఎన్ (టెక్నాలజీ ఇన్నోవేషన్ హబ్ ఆన్ అటానమస్ నేవిగేషన్)ఐఐటీ హైదరాబాద్ సహకారంతో డ్రోన్ టెక్నాలజీ, డిజైన్ టెక్నాలజీ, ఇతర నైపుణ్యాల పై శిక్షణ ఇచ్చేందుకు ఈ వర్క్‌షాపును ప్రారంభించారు. జ్యోతి ప్రజ్వలనచేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన వీసీ విజయ్‌కుమార్ మాట్లాడుతూ వైద్యరంగం, వ్యవసాయం, విపత్తుల నిర్వహణ, రవాణా తదితర రంగాల్లో డ్రోన్ టెక్నాలజీని ఉపయోగించుకోవాలన్నారు. విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దేందుకు ఇలాంటి వర్క్‌షాపులు ఎంతో అవసరమ న్నారు. వర్క్‌షాప్ సమన్వయకర్తలు, డాక్టర్ రియాజ్ హుస్సేన్, జి.భానుకిరణ్, నూజివీ డు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ డైరెక్టర్లు చంద్రశేఖర్, బాలాజి తదితరులు పాల్గొన్నారు.

భోజన ఏజన్సీలకు బకాయిలు చెల్లించండి: చిన్నం

ఆగిరిపల్లి, మార్చి 2: నాలుగు నెలలుగా మధ్యాహ్న భోజన ఏజన్సీలకు ప్రభుత్వం బిల్లులు చెల్లించాలని మాజీ ఎమ్మెల్యే చిన్నం రామకోటయ్య కోరారు. 'ఆంధ్రజ్యోతి'లో శనివారం 'అప్పు చేసి వండి పెడుతున్నాం' శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందించిన ఆయన ఆగిరిపల్లి ఎంపీడీవో శామ్యూల్‌ను కలసి వినతిపత్రం అందించారు. బకాయిలు వెంటనే చెల్లించాలని మధ్యాహ్నం భోజన ఏజన్సీలను ఇబ్బంది పెట్టవద్దని కోరారు. దీనిపై స్పందించిన ఎంపీడీవో శామ్యూల్ ఎంఈవోను పిలిచి నివేదిక తయారు చేయమని తెలిపారు.

పాఠశాల భూములు కాపాడండి..



హెచ్‌ఎంతో మాట్లాడుతున్న చిన్నం

నూజివీడు టౌన్, మార్చి 2: నూజివీడు ఎస్ఆర్ఆర్ బాలుర ఉన్నత పాఠశాల భూమిని పరిరక్షించేం దుకు చర్యలు తీసుకో వాలని నూజివీడు మాజీ ఎమ్మెల్యే చిన్నం రామకోటయ్య కోరారు. శనివారం పాఠశాల హెచ్‌ఎం హేమలతతో పాఠశాల భూమి ఆక్రమణకు సంబంధించి ఆయన మాట్లాడారు. భూ విస్తీర్ణానికి సంబంధించిన రికార్డులకు జిల్లా పరిషత్‌కు లేఖ రాశామని ఆమె తెలిపారు. పాఠశాల భూమి విషయమై పట్టణ ప్రణాళికా విభాగం వద్ద అన్ని ప్లాన్‌లు ఉంటాయని రామకోటయ్య ఆమెకు తెలిపారు.

నేడు ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ

చాట్రాయి, మార్చి 2: మండలంలోని కొత్తగూడెంలో టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ విగ్రహాన్ని 3వ తేదీ సాయంత్రం 4 గంటలకు మాజీ మంత్రి, నూజివీడు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కొలుసు పార్థసారథి ఆవిష్కరిస్తారని పార్టీ మండల అధ్యక్షుడు మరిడి చిట్టిబాబు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల నాయ కులు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

పలు అభివృద్ధి పనులు ప్రారంభం



సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్

నూజివీడు, మార్చి 2: నూజివీడు మండలంలో శనివారం పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు శంకుస్థాప నలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. పోతు రెడ్డిపల్లి గ్రామంలో ఇంటింటికి కుళాయి పథకానికి శంకుస్థాపన, సచివాలయ భవనం, రైతుభరోసా కేంద్రాలను ఆయన ప్రారంభించారు. అనంతరం ముక్కొల్లుపాడు, హనుమంతులగూడెం గ్రామాల్లో పలు పనులను ప్రారంభించారు. నూజివీడు ఎంపీపీ ఆరేపల్లి శిరీష, వైస్ ఎంపీపీ అక్కినేని శ్రీవాణి చౌదరి, పోతురెడ్డిపల్లి సర్పంచ్ తగరం సుజాత, ఉప సర్పంచ్ అక్కినేని వెంకటరామన్ తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయ స్వామి ఆలయ ప్రతిష్ఠ

చాట్రాయి, మార్చి 2: మండలంలోని నరసింహారావుపాలెం-చనుబండ రహ దారి సమీపాన ఆంజనేయస్వామి ఆలయ ప్రతిష్ఠ శనివారం వైభవంగా నిర్వహిం చారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ భారీ అన్నసమారాధన నిర్వహించింది.

టీడీపీ నాయకుడు కనకయ్య మృతి

ముదినేపల్లి, మార్చి 2 : టీడీపీ సీనియర్ నాయకుడు, దాకరం గ్రామ ప్రముఖుడు గొర్రెల్ల కనకయ్య (60) శనివారం గుండెపోటుతో మృతి చెందారు. 1982 నుంచి ఆయన పార్టీకి సేవలందించటమే కాక మండల స్థాయిలో క్రియాశీలక నాయకుడిగా వ్యవహరించారు. ఆయన మృతి పట్ల పలువురు టీడీపీ నాయకులు సంతాపం వ్యక్తం చేయగా, పార్టీ నియోజకవర్గ పోల్ మేనేజ్‌మెంట్ ఇన్‌చార్జ్ కొడాలి వినోద్, దాకరం సర్పంచ్ జాస్తి రాజా కనకయ్య భౌతిక కాయాన్ని సందర్శించి శ్రద్ధాంజలి ఘటించారు. అంత్యక్రియలకు రూ.10 వేలు ఆర్థిక సాయమందించారు. తెలుగుయువత నియోజకవర్గ అధ్యక్షులు దావు నాగరాజు, టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి పంతగాని సురేష్, పార్టీ నాయకుడు పొడపాటి సుధీర్ తదితరులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.



మాట్లాడుతున్న ముదినేపల్లి ఇన్‌చార్జ్ ఎంపీడీవో రమణబాబు



కలిదిండిలో అవగాహన ర్యాలీ

నేడు పల్స్ పోలియో

- అవగాహన ర్యాలీ
- విజయవంతం చేయాలని అధికారుల పిలుపు

ముదినేపల్లి, మార్చి 2 : ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని ఇన్‌చార్జ్ ఎంపీడీవో కె.రమణబాబు కోరారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందితో నిర్వహించిన సమావే శంలో ఆయన మాట్లాడుతూ తొలి రోజే నూరుశాతం పోలియో చుక్కల పంపి ణీ చేసేందుకు అన్ని శాఖల సిబ్బంది సమష్టిగా కృషి చేయాలని కోరారు. ఆరోగ్య శ్రీ యాప్ డౌన్ లోడు, కార్డుల పంపిణీ, ఈకేవైసీ తదితర కార్యక్రమా లను కూడా సిబ్బంది విజయవంతంగా నిర్వహించాలన్నారు. ఈవోపీఆర్డీ డి.లక్ష్మీ నారాయణ, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కలిదిండి: పల్స్ పోలియోపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని వైద్యాధికారులు సుచిత, హేమంత్ అన్నారు. శనివారం కలిదిండిలో పల్స్ పోలియోపై అవగాహన ర్యాలీ నిర్వహించి మాట్లాడుతూ పోలియో చుక్కలతో అంగవైకల్యం దూరమవుతుందన్నారు. ఐదేళ్ల లోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయించాలన్నారు. కలిదిండి మండలంలో మొత్తం 54 పల్స్ పోలియో కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. సుమారు 5 వేల మంది చిన్నారులు ఉన్నారని, వీరందరికీ పోలియో చుక్కలు వేయటానికి చర్యలు తీసుకుంటు న్నామన్నారు. తల్లిదండ్రులు సహకరించాలన్నారు. ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అపోహలు వద్దు: డిప్యూటీ డీఎంహెచ్‌వో

ముసునూరు: అపోహలు వీడి తల్లిదండ్రులు తమ చిన్నారులకు పోలియో చుక్కలు వేయించాలని నూజివీడు ఇన్‌చార్జ్ డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ జె.జగన్మోహన్‌రావు అన్నారు. శనివారం ఆయన ముసునూరు పీహెచ్‌సీని సందర్శించి మాట్లాడుతూ నూజివీడు రెవెన్యూ డివిజన్ పరిధిలో 352 పల్స్ పోలియో బూత్‌లను ఏర్పాటు చేసి, 36,150మంది ఐదేళ్ళ లోపు చిన్నారులకు ఆదివారం పోలియో చుక్కలు వేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఐదేళ్ళ లోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయించాలని కోరారు.

ఆగిరిపల్లి: ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఆగిరిపల్లి పీహెచ్‌సీ ఇన్‌చార్జ్ డాక్టర్ టీనా తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు కార్యక్రమం నిర్వహిస్తామని ఆగిరిపల్లి పీహెచ్‌సీ తరపున 14 బూత్‌లు, మండలంలోని మూడు పీహెచ్‌సీలలో 40 బూత్‌ల ద్వారా 5,392 మంది చిన్నారులకు పోలియోచుక్కల వేస్తామని, 4, 5 తేదీల్లోను ఈ కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

మంచుటెండలు



ఏలూరు రూరల్, మార్చి 2: విభిన్న వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. ఉదయం వేళల్లో సూర్యుడి ప్రతాపానికి ప్రజలు ఠారెత్తిపోతున్నారు. రాత్రి అయితే చలి, ఉదయం దట్టమైన పొగమంచు కురుస్తోంది. వారం రోజులుగా వింత వాతావరణంతో వృద్ధులు, చిన్నారులు అనారోగ్యం పాలవుతున్నారు. ముందు తుఫాన్ కారణంగా వర్షాలు, ఉదయం ఎండల తీవ్రత, తెల్లవారు జామున మంచు ప్రభావంతో ఇబ్బందులు పడ్డారు. కొన్ని ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరిగాయి. శనివారం ఉదయం ఎనిమిది గంటలు దాటినా దట్టమైన పొగమంచుతో రహదారి పై ప్రయాణం చేయాలంటే కత్తిమీద సాముగా మారింది. ఈ ఏడాది వేసవిలో వేడి తీవ్రమై, వడగాల్పులు వీస్తాయని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. మార్చిలోనే సూర్యుడు భగ్గుమంటున్నాడని, రానున్న రోజులలో పరిస్థితి ఎలా ఉంటుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.



వైభవంగా మేరీ మాత ఉత్సవాలు

కలిదిండి, మార్చి 2 : కలిదిండిలో మేరీ మాత ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శనివారం విచారణకర్త బంటుమిల్లి యోహను ఆధ్వర్యంలో జపమాల, ప్రార్థనలు, సాంస్కృతిక కార్యక్రమాలు, అన్నదానం నిర్వహించారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఆలయ ఆవరణలో కల్వరి కొండ వద్ద భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కుబడులు తీర్చుకున్నారు.

బోధనా సామగ్రి వితరణ



ముదినేపల్లి రూరల్, మార్చి 2: మండలంలోని పెదపాలపర్రు ఈదర శోభనాద్రి చౌదరి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థులకు 1987 సంవత్సరం 10వ తరగతి పూర్వ విద్యార్థులు శనివారం బోధనా సామాగ్రి అందజేశారు. దివంగత బొప్పన బాబూరావు చారిటీస్ తరపున, అన్విత గ్రూప్ సీఎండీ బొప్పన అచ్యుతరావు వీటిని సమకూర్చగా సంస్థ డైరెక్టర్, 1987 బ్యాచ్ విద్యార్థి నాగభూషణం పాఠశాల ప్రధానోపాధ్యాయు రాలు శాంతకుమారికి వీటిని అందజేశారు. 10వ తరగతి విద్యార్థులు అందరికి పరీక్షలకు ఉపకరించేలా అట్టలు, జామెంట్రీ బాక్స్‌లు అందించటమే కాక, సాయంత్రం స్టడీ అవర్స్‌కు ఉపయోగపడేలా అదనపు విద్యుత్ సౌకర్యం, దీపాలు సమకూర్చారు. పెదపాలపర్రు సహకార పరపతి సంఘం అధ్యక్షుడు బొప్పన ప్రసాద్, ఈదర సీతారామయ్య, బొప్పన శ్రీనివాస్, ఫణి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరాలపై దాడులు

ఆగిరిపల్లి, మార్చి 2: ఆగిరిపల్లి మండల పరిధిలోని నెక్కలం గొల్లగూడెంలో శుక్రవారం అర్ధరాత్రి దాడిచేసి పది మంది జూదరులను అరెస్ట్‌చేసి రూ.10,500ల నగదును సీజ్ చేసినట్టు ఎస్సై సురేంద్రకుమార్ తెలిపారు. అలాగే శనివారం ఆగిరిపల్లి మార్కెట్‌యార్డులో పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసి రూ.550ల నగదు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభం



సమయం అయిపోతోందని..

ముదినేపల్లి, మార్చి 2 : ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు శనివారం ప్రారంభమ య్యాయి. ముదినేపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో ఆ కళాశాలతోపాటు వీఆర్, వికాస్ జూనియర్ కళాశాల విద్యార్థులు పరీక్షలు రాశారు. ఈ కేంద్రంలో 200 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా, ఏడుగురు గైర్హాజరైనట్లు పరీక్షల చీఫ్ సూపరిం టెండెంట్ ఓరుగంటి సత్యనారాయణ మూర్తి తెలిపారు. డిపార్టమెంటల్ అధికారి కేవీవీ నాగేశ్వరరావు పరీక్షలను పర్యవేక్షించగా, ఎస్ఐ డి.వెంకట్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది బందోబస్తును నిర్వహించారు.

కలిదిండి: మండలంలో కలిదిండి, కోరుకొల్లు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు శనివారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. కలిదిండి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 143 మందికి 139 మంది, కోరుకొల్లు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 26 మందికి 24 మంది విద్యార్థులు హాజరయ్యారని చీఫ్ సూపరింటెండెంట్‌లు ఎన్.గోపాలకృష్ణం రాజు, శాంసన్ రాజు తెలిపారు.

నూజివీడు టౌన్: నూజివీడులో ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ద్వితీయ సంవత్సరం పరీక్షల్లో భాగంగా మొదటిరోజు మొత్తం ఐదు పరీక్షా కేంద్రాల్లో 1380 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా, 41 మంది గైర్హాజరై 1339మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు ఇంటర్ పరీక్షల కస్టోడియన్ స్వర్ణలత తెలిపారు. నూజివీడు ఎమ్మీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 352 మందికి 11 మంది గైర్హాజరు కాగా శ్రీ వాగ్దేవి జూనియర్ కళాశాలలో 280 మందికి ఆరుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారు. సెయింట్ ఆన్స్ జూనియర్ కళాశాలలో 249 మందికి 8 మంది గైర్హాజరయ్యారన్నారు. సిద్ధార్థ జూనియర్ కళాశాలలో 221 మందికి 8 మంది గైర్హాజరయ్యారని, శారదా జూనియర్ కళాశాలలో 278 మంది హాజరుకావాల్సి ఉండగా, 8 మంది గైర్హాజరైనట్టు ఆమె తెలిపారు.



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి షేక్ హబీబ్ భాషా

ఈ క్రాప్ నమోదు తప్పనిసరి

కైకలూరు, మార్చి 2: రైతుభరోసా కేంద్రాల ద్వారా ఈక్రాప్ నమోదును ప్రతి రైతు తప్పనిసరిగా చేయించాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి షేక్ హబీబ్ బాషా అన్నారు. శనివారం కైకలూరులోని వ్యవసాయ కార్యాలయంలో ఆ శాఖాధికారులతో సమావేశం నిర్వహించి వ్యవసాయ పథకాలు, వాటి పురోగతిపై సమీక్షించారు. ఈక్రాప్ జాబితాను ప్రదర్శించడం, రైతుభరోసా, క్రాప్ ఇన్సూరెన్సు, ఇన్‌పుట్ సబ్సిడీ పథకాల పురోగతిపై అడిగి తెలుసుకున్నారు. ఏడీఏ ఆర్. గంగాధరరావు, ఏవో ఆర్. దివ్య తదితరులు పాల్గొన్నారు.

అభ్యంతరాలు లిఖితపూర్వకంగా స్వీకరించండి..

మండవల్లి: రబీలో మినుము సాగు వివరాలు ఈక్రాప్‌లో నమోదు పూర్తయిందని అభ్యంతరాలుంటే రైతుల నుంచి లిఖితపూర్వకంగా సేకరించాలని జిల్లా వ్యవసాయ అధికారి షేక్ హబీబ్ బాషా పేర్కొన్నారు. మండవల్లి వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని ముదినేపల్లి, మండవల్లి వ్యవసాయ అధికా రులతో మండవల్లిలో శనివారం సమావేశాన్ని నిర్వహించి మాట్లాడుతూ ఈక్రాప్ నమోదుతోనే ప్రభుత్వం నుంచి అందే ప్రతి పథకానికి రైతులు అర్హుల వుతారని వివరించారు. ఇప్పటికే ఈక్రాప్ నమోదు పూర్తయిందని గ్రామసభలు నిర్వహించి రైతుల జాబితాలను ప్రదర్శించడం జరుగుతుందన్నారు. వ్యవసా య సబ్ డివిజన్ అధికారిణి వెంకటమణి తదితరులు పాల్గొన్నారు.